MAHANAGAR DINAPATRIKA


మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 275 | పేజీలు : 8 | గురువారం 24 సెప్టెంబర్ 2026 | వెల : 6-00

- రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు: చంద్రబాబు
- కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఐక్యతను మరింత బలోపేతం చేయాలి
- స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని వచ్చే బాధ్యతను ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలి
- ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై రైల్వే యాక్ట్ తరహాలో కఠిన చట్టం తీసుకురావాలి
- రాజకీయ నాయకుల ముసుగులో అసాంఘిక శక్తులు విధ్వంసానికి పాల్పడుతున్నాయి
- వైకాపా రౌడీ మూకలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి

ఎన్నికలకు సిద్ధమవ్వండి

కూటమి అభ్యర్థుల బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదే





ఉద్యోగులకు డబుల్ బొనాంజా

కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి
- మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ 2లో
- తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర

అన్ని ఆధారాలతో గవర్నర్‌కు ఫిర్యాదు



- డీఎస్సీ ఉద్యోగాలకు సంబంధించి బేరసారాలపై ఆడియో, వీడియో కూడా బయటకు వచ్చింది.
- శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై టీడీపీ గుండాలు దారుణంగా దాడి
- శాంతియుత నిరసన వ్యక్తం చేస్తుంటే, రౌడీ షీట్లు ఎలా ఓపెన్ చేస్తారు
- మా ఈ యుద్ధం కొనసాగుతుంది. ఇందులో న్యాయం, ధర్మం తప్పకుండా గెలుస్తుంది
- విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి. దీనిపై సీబీఐ విచారణ జరగాలి.
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్

అమరావతి, మహానగర్

డీఎస్సీ అక్రమాలకు పాల్పడిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులపై జరిగిన దాడికి సంబంధించి ఆయన గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. గవర్నర్‌తో భేటీ అనంతరం వైఎస్ జగన్ లోక్‌భవన్ వద్ద - మిగతా2లో



విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై

మంత్రి లోకేశ్ ఫోకస్

- అధికారులకు కీలక ఆదేశాలు
- రాష్ట్రవ్యాప్తంగా 963 పాఠశాలల్లో హార్ట్‌ఫుల్ యోగా శిక్షణకు చర్యలు
- టెన్త్, ఇంటర్‌లో 90% ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి 5
- పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- ఉద్యోగ మేళాల నిర్వహణలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి

పంచ సూత్రాలతో అమరావతి నిర్మాణం

- భవిష్యత్ ప్రణాళికలను వివరించిన చంద్రబాబు
- తుళ్లూరు మండలంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- ఈ కేంద్రం ప్రపంచంలోనే అత్యుత్తమ కంటి వైద్యశాలగా నిలవాలని ఆకాంక్ష
- పంచ సూత్రాల ఆధారంగా అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నామని వెల్లడి
- క్వాంటం వ్యాలీ, హెల్త్ కేర్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతామని హామీ
- రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులకు ముఖ్యమంత్రి ప్రత్యేక అభినందనలు



అమరావతి, మహానగర్

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్వీపీఈఐ) నూతన క్యాంపస్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా, విజ్ఞానం, ఆరోగ్యం, సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ నూతన కేంద్రం కేవలం రాష్ట్రానికే కాకుండా, ప్రపంచ కంటి వైద్య రంగంలోనే ఒక మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, “40 ఏళ్ల క్రితం లాభాపేక్ష లేకుండా, కేవలం ప్రజాసేవ అనే లక్ష్యంతో ప్రారంభమైన ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్, ఇప్పటివరకు - మిగతా2లో




ఎడతెరిపి లేని వర్షం

- తీవ్ర వాయుగుండం ప్రభావం
- గోదావరి జిల్లాల్లో దంచికొడుతున్న వానలు
- బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు 5
- ఎడతెరిపి లేని వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి
- లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

ఉద్యోగులకు డబుల్ బొనాంజా

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.



జగన్ పై మంత్రి ఫైర్

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు.

డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది.

ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది.

కొత్త పోలీస్ కమిషనరేట్లు:

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు.

ఉద్యోగులకు డబుల్ బొనాంజా:

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు.

చిన్న రైతులకు భరోసా

భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది రాజధాని రైతులకు ఎఎన ఊరటనిచ్చే నిర్ణయం.

ఇతర ముఖ్యమైన నిర్ణయాలు

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు.

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు.

న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు.

భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైత, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

ఆండ్రాయిడ్‌లోకి అడోబ్ ప్రీమియర్



విజయవాడ

అడోబ్ ప్రీమియర్ మొబైల్ యాప్‌ను ఆండ్రాయిడ్ పరికరాల్లో ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అడోబ్ ప్రకటించింది. క్రియేటర్ల కోసం రూపొందించిన ఈ యాప్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌లోనే ప్రొఫెషనల్ స్థాయి వీడియోలను సులభంగా రూపొందించుకోవచ్చని సంస్థ తెలిపింది. ఎన్హాన్స్ ఆడియో ఫీచర్‌తో బ్యాక్‌గ్రౌండ్ శబ్దాన్ని తగ్గించి వాయిస్‌ఓవర్లు, ఇంటర్వ్యూలు, ఇతర రికార్డింగ్ల స్పష్టతను మెరుగుపరచవచ్చు. ఫ్రేమ్-అక్యురేట్ ఎడిటింగ్‌తో ప్రతి కట్‌ను కచ్చితంగా సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంది. మల్టీ-ట్రాక్ టైమ్‌లైన్‌లో వీడియో, మ్యూజిక్, టెక్స్ట్, ఎఫెక్ట్స్, వాయిస్‌ఓవర్లను ఒకేసారి లేయర్ చేసుకోవచ్చు. క్రియేటర్ టెంప్లేట్లు, అడోబ్ స్టాక్, సొంత ఫైళ్లు, ఎక్స్‌ట్రాక్ట్ చేసిన ఆడియో, ట్రాన్సిషన్స్, క్రియేటివ్ అసెట్స్‌ను ఉపయోగించుకునే సదుపాయం ఉంది. 4కె వీడియోలను ఎడిట్ చేసి ఎగుమతి చేయడంతో పాటు, ఫైర్‌ఫ్లై ఆధారిత జనరేటివ్ ఏఐ ఫీచర్లతో జనరేటివ్ ఫిల్, ఇమేజ్-టు-వీడియో, జనరేట్ సౌండ్ ఎఫెక్ట్స్ వంటి సదుపాయాలను వినియోగించుకోవచ్చు. ప్రకటనలు, వాటర్‌మార్క్‌లు లేకుండా ఎడిటింగ్ చేసుకోవచ్చని అడోబ్ తెలిపింది. త్వరలో అడోబ్ ఫాంట్స్, మెరుగైన క్యాప్షన్స్, కీఫ్రేమ్స్, క్రాపింగ్, బీట్ డిటెక్షన్, డెస్క్‌టాప్ ఎడిటింగ్ కొనసాగింపు వంటి మరిన్ని ఫీచర్లు అందుబాటులోకి రానున్నాయి. ఆండ్రాయిడ్ 13 లేదా ఆ తర్వాతి వెర్షన్‌తో, కనీసం 5జీబీ ర్యామ్ ఉన్న పరికరాల్లో ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఉపయోగించుకోవచ్చు.

ఎన్నికలకు సిద్ధమవ్వండి

అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్ఈసీ ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఇన్‌ఛార్జ్ మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని వచ్చే బాధ్యతను ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రులకు ఎలక్షన్ టార్గెట్ నుంచి లా అండ్ ఆర్డర్ వరకు అన్ని అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై రైల్వే యాక్ట్ తరహాలో కఠిన చట్టం తీసుకురావాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయకుల ముసుగులో అసాంఘిక శక్తులు విధ్వంసానికి పాల్పడుతున్నాయని, వైకాపా రౌడీ మూకలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. జగన్ బెంగళూరులో కూర్చుని రౌడీ గ్యాంగ్ ద్వారా ఏపీలో అరాచకాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్‌ను దెబ్బతీసే ఎలాంటి ప్రయత్నాన్నీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడి ఘటన.. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడిన తీరు బట్టబయలైందని చంద్రబాబు అన్నారు. శాప్ కార్యాలయం, టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌పై జరిగిన దాడుల్లో ఒకే వ్యక్తులు ఉన్నారన్న అంశాన్ని ప్రస్తావించారు. వైసీపీ నేతలు జరగని విషయాలను జరిగినట్లుగా ప్రచారం చేయడంలో సిద్ధహస్తులని ఆరోపిస్తూ, ఉద్దేశపూర్వకంగా బురద చల్లే ప్రయత్నాలను తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

పంచ సూత్రాలతో అమరావతి నిర్మాణం

-మొదటిపేజీ తరువాయి

మూడు కోట్ల మందికి చికిత్స అందించి చరిత్ర సృష్టించింది. దేశంలో నెంబర్ 1, ఆసియాలో నెంబర్ 2, ప్రపంచంలో 6వ స్థానంలో ఉన్న ఇంతటి ప్రతిష్టాత్మక సంస్థ మన అమరావతికి రావడం గర్వకారణం" అని అన్నారు. ఈ సంస్థకు 12 ఎకరాల భూమి కేటాయించామని, భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

"అమరావతిలో ఏర్పాటయ్యే ఈ కేంద్రం ప్రపంచంలోనే నెం.1గా నిలవాలి. చికిత్స, పరిశోధన, పునరావాసం.. ఇలా కంటికి సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రపంచం అమరావతి వైపు చూడాలి" అని ఆయన ఆకాంక్షించారు. సంవత్సరానికి మూడు లక్షల మందికి సేవలు అందించడమే కాకుండా, పరిశోధన, విద్య, శిక్షణ, కమ్యూనిటీ ఐ హెల్త్ వంటి విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ బృహత్కార్యానికి మూలపురుషులైన డాక్టర్ జి.ఎన్. రావు, ప్రధాన దాత జాస్తి వెంకట్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఐదు సూత్రాలతో అమరావతి నిర్మాణం

అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఒక భవిష్యత్ దర్శనమని చంద్రబాబు అన్నారు. ఐదు ప్రధాన సూత్రాల (పంచ సూత్రాలు) ఆధారంగా నగరాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు.

1. నో పోల్ సిటీ: విద్యుత్, టెలిఫోన్ తీగలన్నీ భూగర్భంలోనే ఉంటాయి. వీధుల్లో స్తంభాలు కనిపించవు.
2. బ్లూ సిటీ: కృష్ణా నది, ఇన్ లాండ్ కాలువలతో నగరం జలకళతో ఉట్టిపడుతుంది. గోదావరి-కృష్ణా అనుసంధానంతో నదిలో నీటికి కొరత ఉండదు.
3. గ్రీన్ సిటీ: నగరంలో 50% పైగా పచ్చదనం ఉంటుంది. ఇక్కడి నేల స్వభావం వల్ల పచ్చదనం ఏపుగా పెరిగి ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తుంది.
4. గ్రీన్ ఎనర్జీ: కాలుష్య రహిత, పునరుత్పాదక ఇంధనాన్ని మాత్రమే వినియోగిస్తాం. నగరాన్ని నెట్-జీరో కార్బన్ సిటీగా తీర్చిదిద్దుతాం. ఇక్కడ నివసించే వారి ఆయుష్షు 25 ఏళ్లు పెరుగుతుంది.
5. డీప్ టెక్నాలజీ: అత్యాధునిక సాంకేతికతను జీవితంలోని ప్రతి అణువులో భాగం చేస్తాం.

టెక్నాలజీ హబ్‌గా అమరావతి

గతంలో తాను ఐటీకి ప్రాధాన్యత ఇస్తే, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి డీప్ టెక్నాలజీలపై దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు. "ప్రపంచంలో ఆరు దేశాల్లో మాత్రమే ఉన్న క్వాంటం టెక్నాలజీని అమరావతికి తీసుకొచ్చాం. ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థలతో కలిసి 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు వచ్చాయి. అక్టోబర్ 3న ఐదు కళాశాలల్లో మన వాళ్లు తయారు చేసిన క్వాంటం కంప్యూటర్లను ప్రారంభిస్తున్నాం. మన యువతకు ప్రోత్సాహం ఇస్తే ప్రపంచాన్నే జయిస్తారు" అని ఆయన అన్నారు. స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, సెమీ కండక్టర్ క్లస్టర్లతో అమరావతి భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా మారుతుందన్నారు.

విజ్ఞానం, ఆరోగ్యానికి కేంద్రం

అమరావతిని ఒక నాలెడ్జ్ ఎకానమీ, హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు. "ఇప్పటికే ఎస్ఆర్ఎం, విట్, అమృత యూనివర్సిటీలు వచ్చాయి. త్వరలో బిట్స్ పిలానీ, ఎక్స్ఎల్ఆర్ఐ వంటి సంస్థలు రాబోతున్నాయి. మరోవైపు ఎయిమ్స్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, కిమ్స్, ఇప్పుడు ఎల్వీ ప్రసాద్ వంటి సంస్థలతో అమరావతి గ్లోబల్ హెల్త్ హబ్‌గా మారుతుంది. రేపు ప్రపంచమంతా వైద్యం కోసం అమరావతికి వచ్చే రోజు దగ్గరలోనే ఉంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రూ.60,000 కోట్ల విలువైన రోడ్లు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాలు నగరాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని వివరించారు.

అన్ని ఆధారాలతో గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం

-మొదటిపేజీ తరువాయి

మీడియాతో మాట్లాడారు.

డీఎస్సీ స్కామ్‌లో ఇవీ నాలుగు పాయింట్లు:

ఇప్పుడే గవర్నర్‌గారిని కలవడం జరిగింది. గవర్నర్‌కు వివరంగా.. సెప్టెంబరు 21న జరిగిన ఘటనపైనే కాకుండా, ఏ విధంగా డీఎస్సీ స్కామ్‌లో యువత నష్టపోయింది అనేది వివరించాము. ఈ వ్యవస్థలో ఒక మార్పు రావాలన్నా, ఈ వ్యవస్థ మీద ప్రజలకు మళ్లీ నమ్మకం రావాలన్నా, ఈ వ్యవస్థలో లోపాలు సవరించాలన్నా డీఎస్సీ స్కామ్‌పై కచ్చితంగా సీబీఐ విచారణ జరగాలి. విద్యా శాఖ మంత్రి రాజీనామా కూడా చేయాలి. దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా, నాలుగు పాయింట్ల ఆధారంగా డీఎస్సీలో అక్రమాలు చోటు చేసుకున్నాయి.

1). మొట్టమొదట రెండు ఫంక్షన్లు ఒకే వ్యక్తి చేతికి అప్పగించడం. ప్రశ్నపత్రం తయారీ, పరీక్ష నిర్వహణ రెండూ ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు అప్పగించారు. దీంతో స్కామ్ ప్రారంభం అయింది.

2). రెండోది మొత్తం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతిలో పెట్టారు. అలా పని చేస్తున్న నవీన్ అనే వ్యక్తికి కృష్ణా జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ వచ్చినా, అతడికి ఉద్యోగం ఇవ్వలేదు. తన పేరు తొలి మెరిట్ లిస్ట్‌లో చూపి, ఆ తర్వాత లిస్ట్‌లో పేరు తొలగించారు. అతడి లాగిన్ ఐడీ బ్లాక్ చేశారు. కాల్ లెటర్ కూడా పంపలేదు. దీంతో అతడు ప్రభుత్వానికి లేఖ రాయడమే కాకుండా, కోర్టుకు కూడా వెళ్లాడు. అంటే ఒక స్కామ్‌ను కవర్ చేయడానికి ఎన్ని అగచాట్లు పడుతున్నారు. అనేది తెలియడంతో పాటు, లీకేజీ వ్యవహారం బట్టబయలైంది.

3). స్పోర్ట్స్ కోటా పేరుతో అడ్డగోలుగా జీఓలు ఇచ్చారు. గతంలో ఉన్న జీఓలు రద్దు చేసి కొత్తగా.. జీఓ నెం: 4, 47 అని చెప్పి, రెండు కొత్త జీఓలు తెచ్చి, వాటి ద్వారా పరీక్ష రాయాల్సిన అవసరం లేకుండా ఉద్యోగాలు ఇచ్చారు. ఆ తర్వాత 372 ఉద్యోగాలు ఆ జీఓల పేరుతో ఇచ్చారు. ఆ రిక్రూట్‌మెంట్ పూర్తి కాగానే మళ్లీ మూడు జీఓలు తెచ్చారు. జీఓ నెం: 23, 25, 56 తెచ్చారు. దాని ప్రకారం మళ్లీ పరీక్ష ఉండాలని నిబంధన పెట్టారు. మరి ఇక్కడ 372 మందికి ఎలా ఉద్యోగాలు ఇచ్చారన్న దానికి సమాధానం లేదు.

4). ఫేక్ సర్టిఫికెట్లు. ఏరకంగా నారా లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్ దొంగ సర్టిఫికెట్లు ఇచ్చాడో చూశాం. జరగని గేమ్స్ జరిగినట్లు చూపారు. అలాగే ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయిన ఎమ్మెల్యే కూన రవికుమార్.. దాదాపు 38 ఉద్యోగాలకు సంబంధించి, సర్టిఫికెట్లు ఇచ్చారనేది కూడా చెప్పాం. ఇంకాసాఫ్ట్‌బాల్ అసోసియేషన్లకు సంబంధించి కొన్ని



జిల్లాలో సెక్రటరీలకు, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చారు అనేవి కూడా చెప్పాం.

బేరసారాల ఆడియో. వీడియో:

డీఎస్సీ ఉద్యోగాలకు సంబంధించి బేరసారాలపై ఆడియో, వీడియో కూడా బయటకు వచ్చింది. అందులో క్లియర్‌గా ఫోన్ నెంబర్ కనిపిస్తున్నా, ఆ వ్యక్తి గురించి ఎఫ్ఐఆర్‌లో రాయలేదు. కేవలం సస్పెక్ట్ అని మాత్రమే రాశారు. అరెస్టు కూడా చేయకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. అయినా సీఎం చంద్రబాబు అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారు.

శాప్ ఆఫీస్ వద్ద టీడీపీ గుండాల దాడి:

సెప్టెంబరు 21న శాప్ ఆఫీస్ వద్ద శాంతియుత నిరసన వ్యక్తం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముందుగానే సమాచారం ఇచ్చారు. అనుమతి కోరుతూ లెటర్ కూడా రాశాడు. కానీ, ఆరోజు ఏం జరిగింది. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎలా కుట్ర చేశారో చూశాం. టీచర్లు కాని టీచర్లను పిలిపించి, ప్యారలల్‌గా ధర్నా చేయించాడు. నిజానికి వారు చదువు చెప్పే గురువులు కాదు. దొంగ సర్టిఫికెట్లతో, ఏ పరీక్ష రాయకుండా ఉద్యోగాలు పొందిన వారు. అందుకే వారు టీచర్లు కానీ టీచర్లు. వారిని పిలిపించి, కావాలని శాప్ ఆఫీస్ వద్ద గొడవ చేయించారు. అంతే కాకుండా టీడీపీ గుండాలను కూడా అక్కడికి రప్పించారు. వారంతా కలిసి మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై దారుణంగా దాడి చేశారు. అసలు వారంతా ఎవరో చూడండి. వీరు గతంలో సాక్షి ఆఫీస్‌పై దాడి చేసింది కూడా వీరే.(అంటూ, ఆ ఫోటోలు మీడియాకు చూపారు)

పైగా రివర్స్ కేసులు:

శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై ఆ విధంగా టీడీపీ గుండాలు అంత దారుణంగా దాడి చేసినా, వారిపై ఎలాంటి చర్యలు లేవు. వారిపై కేసులు నమోదు చేయలేదు. అందుకు పూర్తి భిన్నంగా, రివర్స్‌లో మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై కేసు పెట్టారు.ఎంత దారుణంగా ఆ కేసులు పెట్టారంటే.. హత్యాయత్నం కేసులు. ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసులు పెట్టారు. ఇప్పటికే 350 మందిపై కేసులు పెట్టారు. ఆ జాబితా ఇంకా పెరుగుతోంది. ఇంకా రాత్రి వేళల్లో ఇళ్లపై బడి అరెస్టులు చేస్తున్నారు. అయితే అదృష్టవశాత్తూ.. కోర్టులు వాటిని తప్పు పడుతున్నాయి. దీని వల్ల సామాన్యులు బ్రతుకుతున్నారు. మరోవైపు మొన్నటి శాంతియుత నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేశారు. వాటిపైనా కోర్టులు స్పందించాయి.

శాంతియుత నిరసన వ్యక్తం చేస్తుంటే, రౌడీ షీట్లు ఎలా ఓపెన్ చేస్తారని నిలదీశాయి.

మా పోరాటం కొనసాగుతుంది:

తప్పు చేసింది మీరు. ప్రశ్నించే హక్కు లేదా? దాన్ని కూడా కాల రాస్తారా? ఇంత దిక్కుమాలిన ప్రభుత్వం ప్రపంచంలోనే ఉండదేమో.. మా ఈ యుద్ధం కొనసాగుతుంది. ఇందులో న్యాయం, ధర్మం తప్పకుండా గెలుస్తుంది. విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి. దీనిపై సీబీఐ విచారణ జరగాలి. కనీసం అప్పుడైనా మన రాష్ట్రంలో పిల్లలకు, నిరుద్యోగులకు పరీక్షల మీద విశ్వాసం ఏర్పడుతుంది. పోటీ పరీక్షలు పారదర్శకంగా జరుగుతాయన్న నమ్మకం కలుగుతుంది. ఆ దిశలో మా డిమాండ్ కొనసాగుతోంది. మీడియా ప్రశ్నలకు బదులిస్తూ..

సుప్రీంకోర్టు ఆదేశం ప్రభుత్వానికి చెంపదెబ్బ:

విజయవాడలో సాయికృష్ణ లాకప్‌డెత్‌కు సంబంధించిన కేసు చూస్తే.. ఏ రకంగా చంద్రబాబు ప్రభుత్వం పిల్లలను వాడుకుంటూ, వారితో గంజాయి అమ్మిస్తూ, వారితో చట్టవిరుద్ధమైన పనులు చేయించారు?. ఇందులో పోలీసులు ఎలా పని చేశారు? ప్రభుత్వం ఎలా అధికార దుర్వినియోగం చేస్తోంది అనేదానికి నిదర్శనం.

సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో సుప్రీంకోర్టు ఈరోజు ఇచ్చిన ఆదేశాలు. అవి నిజంగా ఒక చెంపదెబ్బ చంద్రబాబు ప్రభుత్వం మీద. సుప్రీంకోర్టు గట్టిగా మందలిస్తూ.. సీపీ, డీజీపీని కూడా ఎందుకు అక్యూజ్డ్ లిస్టులో చేర్చలేదని నిలదీయడం.. నిజంగా ప్రభుత్వానికి చెంపదెబ్బ. ఒక పిల్లాడిని అరెస్టు చేసి తీసుకొస్తారు. కొట్టి చంపారు. చివరకు శవం కూడా మాయం చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో, రెడ్‌బుక్ రాజ్యాంగంలో నగరం మధ్యలో ఏ విధంగా దారుణాలు జరుగుతున్నాయి అని చెప్పడంతో పాటు, పోలీసుల అరాచకాలకు ఇవన్నీ నిదర్శనంలా నిలుస్తున్నాయని వైఎస్ జగన్ అన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తం

- కంట్రోల్ రూమ్ నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ
- ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలి
- లోతట్టు ప్రాంతాలు, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అత్యవసర సమాచారాన్ని కంట్రోల్ రూమ్ 9154970454కి అందించాలి



విజయవాడ, మహానగర్

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించి, వర్షాల పరిస్థితి, ప్రజల నుంచి ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు, వాటిపై అధికారులు తీసుకున్న చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల స్వీకరణ, నమోదు, సంబంధిత శాఖలకు సమాచారం చేరవేయడం, వాటిపై తీసుకున్న చర్యలను పర్యవేక్షించడం వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులకు వెంటనే చేరవేసి, సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ నుంచి వైర్లెస్ సెట్ ద్వారా డివిజనల్ స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి, జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి స్థాయిలో అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. జిల్లాలో నమోదవుతున్న వర్షపాత వివరాలను ప్రతి రెండు గంటలకు ఒకసారి క్రమం తప్పకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నమోదైన వర్షపాత వివరాలను సంబంధిత అధికారులకు, మీడియా ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షపాతానికి సంబంధించిన సమాచారంలో ఎలాంటి ఆలస్యం లేకుండా కంట్రోల్ రూమ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటి ప్రవాహం, రహదారుల పరిస్థితి, ప్రజల రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రజలకు తక్షణ సహాయం అందేలా అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణలో కంట్రోల్ రూమ్ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించే సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండి, ప్రజల నుంచి అందే సమాచారం, ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తక్షణమే తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సహాయం, సమాచారం సకాలంలో అందేలా కంట్రోల్ రూమ్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

నేడు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు సెలవు

విజయవాడ, మహానగర్

తీవ్ర వాయుగుండం ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 24 గురువారం అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు ఒకరోజు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో ఎటువంటి అసౌకర్యం, ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం



విజయవాడ, మహానగర్

జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సుతోపాటు ఆయుర్వేద వైద్య విధాన అభివృద్ధిని ఆకాంక్షిస్తూ శ్రీ ధన్వంతరి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయుష్ శాఖ డైరెక్టర్ గోపాలకృష్ణ రౌణంకి, అదనపు డైరెక్టర్ డా. పి. సాయి సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జె. ధనుంజయరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీసీఆర్ఏఎస్--స్పార్క్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన యూజీ విద్యార్థులు, పీజీ స్కాలర్లకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలు, కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, బహుమతులు అందజేశారు. ఈ వేడుకలు ఆయుర్వేద విద్య, పరిశోధన, వైద్య సేవలు, ప్రజల్లో ఆయుర్వేదంపై అవగాహన పెంపొందించడంలో డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల నిబద్ధతను ప్రతిబింబించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. బుల్లయ్య, డా. ఏ.ఎల్. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. పి. జగదీష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, పీజీ స్కాలర్లు, ఇంటర్న్‌లు, ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్కూల్ బస్సు డ్రైవర్లు అంకితభావంతో విధులు నిర్వహించాలి

విజయవాడ, మహానగర్

పాఠశాల విద్యార్థులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో పాఠశాల బస్సు డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ డ్రైవర్లు నిబద్ధతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. బెంజ్ సర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల బస్సు డ్రైవర్లకు డ్రైవింగ్ మెళకువలు, రహదారి భద్రత, విద్యార్థుల సురక్షిత ప్రయాణం తదితర అంశాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ పాఠశాల బస్సు డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలని తెలిపారు. యూనిఫామ్‌లో ఉన్న డ్రైవర్లను చూడటం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు భద్రతపై మరింత నమ్మకం, భరోసా కలుగుతుందని అన్నారు. పాఠశాల బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల భద్రత ప్రధానంగా డ్రైవర్ల బాధ్యతపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ బాధ్యతను ప్రతి డ్రైవర్ అత్యంత జాగ్రత్తగా, నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. డ్రైవర్లు కేవలం డ్రైవింగ్‌లో నైపుణ్యం కలిగి ఉండటం మాత్రమే కాకుండా సహనం, సమయపాలన, మంచి ప్రవర్తన, బాధ్యతాయుత వైఖరి, వాహన నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాన్ని అత్యంత అప్రమత్తంగా నడపాలని తెలిపారు. డ్రైవింగ్‌లో ఎప్పటికప్పుడు తాజా మెళకువలను నేర్చుకుంటూ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని డ్రైవర్లకు సూచించారు. విద్యార్థుల సురక్షిత రవాణా విషయంలో పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పాఠశాల బస్సులు, టాక్సీలు నడిపే డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవసరమైన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రైవర్లు కూడా మేలైన డ్రైవింగ్ పద్ధతులు, రహదారి భద్రతా చర్యలు, వాహనాల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై పరస్పరం చర్చించుకుని తమ అనుభవాలను పంచుకోవాలని అన్నారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, రవాణా శాఖ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భద్రతకు సంబంధించి డ్రైవర్లకు అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాఠశాల బస్సు డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్ పద్ధతులు, రహదారి భద్రతా నియమాలు, వాహన నిర్వహణ, విద్యార్థుల పట్ల బాధ్యతాయుత ప్రవర్తన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.పురేంద్ర, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల బస్సు, టాక్సీ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



వర్షం కారణంగా రెండు మ్యాచ్‌లు రద్దు

టాస్ కూడా పడకుండానే మ్యాచ్‌లకు ముగింపు

రాయలసీమ, గోదావరి జట్లకు చెరో పాయింట్



మంగళగిరి, మహానగర్

ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) పోటీలను వర్షం వెంటాడింది. ఎడతెరిపిలేని వర్షం కారణంగా బుధవారం జరగాల్సిన రెండు మ్యాచ్‌లు పూర్తిగా రద్దయ్యాయి. కనీసం టాస్ నిర్వహించేందుకు కూడా వాతావరణం సహకరించకపోవడంతో మ్యాచ్‌లను నిర్వహించే అవకాశం లేకుండా పోయింది. ఉదయం నుంచే మంగళగిరి వేదికపై భారీ వర్షం కురుస్తుండటంతో మైదానాన్ని పూర్తిగా కవర్లతో కప్పి ఉంచారు. వర్షం ఏ దశలోనూ విరామం ఇవ్వకపోవడంతో కవర్లను తొలగించి మైదానాన్ని మ్యాచ్‌కు సిద్ధం చేసే పరిస్థితి లేకుండా పోయింది. అంపైర్లు, గ్రౌండ్ సిబ్బంది పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించినప్పటికీ వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌లను రద్దు చేయాల్సి వచ్చింది. డబ్ల్యూఏపీఎల్‌లో భాగంగా తొలుత జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, అనంతరం జరగాల్సిన రాయలసీమ జెన్ స్టార్స్--గోదావరి గోల్డెన్ ఈగల్స్ మ్యాచ్ కూడా వర్షార్పణమైంది. ఇరుజట్ల ఆటగాళ్లు మ్యాచ్ కోసం సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మైదానంలోకి అడుగుపెట్టే అవకాశం కూడా లేకపోయింది. మ్యాచ్ రద్దు కావడంతో నిబంధనల ప్రకారం రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి గోల్డెన్ ఈగల్స్ జట్లకు చెరో పాయింట్ లభించింది. దీంతో వర్షం కారణంగా బుధవారం జరగాల్సిన రెండు మ్యాచ్‌లు ఒక్క బంతి కూడా పడకుండానే ముగిశాయి. మంగళగిరి స్టేడియంలో ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా మ్యాచ్ నిర్వహణకు అవసరమైన మైదాన పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో నిర్వాహకులు, అంపైర్లు మ్యాచ్‌లను రద్దు చేయాలని నిర్ణయించారు. డబ్ల్యూఏపీఎల్‌లో కీలక మ్యాచ్‌లు కొనసాగుతున్న నేపథ్యంలో అభిమానులు తదుపరి మ్యాచ్‌ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే గురువారం మ్యాచ్‌లను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధంగా ఉన్నారు.

ఈ నెల 30న పేదలకు పట్టాభిషేకం

- సీఎం చేతుల మీదుగా పండగ వాతావరణంలో పట్టాల పంపిణీ
- తొలిదశలో 24,042 మంది లబ్ధిదారులకు పట్టాలు
- క్రమబద్ధీకరణతో పేదల చేతుల్లో రూ. 23,213 కోట్ల విలువైన ఆస్తి
- అన్ని హక్కులతో ప్రజల దశాబ్దాల కల నెరవేరుతున్న శుభవేళ
- ఇంకా ఎవరైనా మిగిలితే రెండో దశలో వారి సమస్యలనూ పరిష్కరిస్తాం
- ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటం, ప్రతి పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, పూర్తి హక్కులతో కూడిన ఆస్తి భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 30న నగరంలో ముఖ్యమంత్రి చేతులుమీదుగా పండగ వాతావరణంలో పట్టాల పంపిణీ జరగనుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. తొలిదశలో జిల్లా వ్యాప్తంగా 24,042 మంది లబ్ధిదారులకు రూ. 23,213 కోట్ల మార్కెట్ విలువ కలిగిన ఆస్తి క్రమబద్ధీకరణ ద్వారా పేదల చేతికి అందుతుందని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో ఎంపీ కేశినేని శివనాథ్.. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నెల 30వ తేదీన జరిగే కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇది ప్రజల ప్రభుత్వమని.. పేదల క్షేమం, సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. 1970, 1980ల్లో, తదుపరి సంవత్సరాలలో జారీచేసిన ఎన్‌టీఆర్ పట్టాలు, ఇతర పట్టాలకు సంబంధించి 12,710 మంది లబ్ధిదారులకు జీవోఎంఎస్ నెం.306 ద్వారా మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూముల్లో ఉంటున్న 2,586 మంది లబ్ధిదారుల కేసులను జీవోఎంఎస్ నెం.30 ద్వారా పరిష్కరించి, క్రమబద్ధీకరించడం జరిగిందన్నారు. 8,746 మంది ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్ (పీవోటీ) ఉల్లంఘనదారుల సమస్య కూడా పరిష్కారమైందన్నారు. ఇలా, జిల్లా పరిధిలోని విజయవాడ పశ్చిమ, విజయవాడ తూర్పు, విజయవాడ మధ్య, గన్నవరం, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో 24,042 మంది లబ్ధిదారులకు చెందిన 616.56 ఎకరాల (దాదాపు 29,84,145 చదరపు గజాలు) భూమికి సంబంధించి ప్రైవేటు ఆస్తికి సమానంగా అన్ని హక్కులతో పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ ప్రజల దశాబ్దాల కల నెరవేరుతోందని.. రెండో దశలోనూ మిగిలిన వారి సమస్యలు పరిష్కారమవుతాయని, అందరికీ న్యాయం జరుగుతుందని వివరించారు. సమష్టి కృషి, పటిష్ట సమన్వయం కారణంగా ఇది సాధ్యమైందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. వివిధ సమావేశాల్లో చర్చించి, సమస్య పరిష్కారానికి కృషిచేయడం జరిగిందని, దశాబ్దాలుగా జఠిలంగా ఉన్న సమస్యను పరిష్కరించి, పేదలకు భరోసా కల్పించినందుకు గౌరవ సీఎం, గౌరవ డిప్యూటీ సీఎంలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఏవైనా ఉంటే వాటిని కూడా పరిశీలించి క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు సమష్టిగా కృషిచేసి పట్టాల పంపిణీకి సన్నద్ధమైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నియమనిబంధనలను అనుసరించి పట్టాలు అందించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన సీడీపీఓ

అవనిగడ్డ, మహానగర్




ఐసీడీఎస్ నూతన సీడీపీఓగా నియమితులైన ఈపూరి వాణి బుధవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షెహనాజ్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఊగిసలాటలో చమురు ధరలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధమని తెలిపింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి వెల్లడించినట్లు రాయిటర్స్ తెలిపింది. మధ్యవర్తుల ద్వారా ఈ ప్రతిపాదనను అమెరికాకు చేరవేసినట్లు సమాచారం.అమెరికాతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ఈ ప్రతిపాదనతో సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా న్యూయార్క్‌లో మధ్యవర్తి దేశాలతో ఈ అంశంపై చర్చించాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భేటీ ఉండబోదని ఇరాన్ అధికారి తెలిపారు. అయితే అమెరికా నిబద్ధత చూపితే ఒప్పందం దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు.హర్మూజ్ జలసంధికి సంబంధించిన సైనిక చర్యలను అమెరికా నిలిపివేయాలని ఇరాన్ కోరుతోంది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, ఇరాన్ పోర్టులపై ఆంక్షలు ఎత్తివేస్తే జలసంధిని తిరిగి తెరిచి చర్చలను కొనసాగిస్తామని టెహ్రాన్ చెబుతోంది. పోర్టులపై ఆంక్షలు ఇరాన్ ముడిచమురు ఎగుమతులు, సముద్ర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. చర్చలను పునరుద్ధరించేందుకు ఇరాన్ గతంలో ఏడు షరతులను కూడా వెల్లడించింది.హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకునే అవకాశం ఉందన్న వార్తలతో అంతర్జాతీయ చమురు ధరలు తగ్గాయి. బ్యారెల్ చమురు ధర 99 డాలర్ల దిగువకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర సెషన్ గరిష్ఠ స్థాయి నుంచి 3.5 శాతానికి పైగా తగ్గగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 2.25 శాతం పడిపోయింది. హర్మూజ్ ద్వారా ముడిచమురు సరఫరాలో అంతరాయాలపై ఆందోళనలు తగ్గడంతో ధరలు దిగివచ్చాయి. మురు సరఫరా వ్యవస్థలో తలెత్తిన కీలక పరిణామాలు మరియు మౌలిక వసతులు నరుద్ధరించబడటమే ఈ లభ్యతకు, ఫలితంగా ధరల తగ్గుదలకు ముఖ్య కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి దారులలో ???న సౌదీ అరేబియా తమ 'ఈస్ట్ వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్' ద్వారా సరఫరాలను తిరిగి ప్రారంభించడం మార్కెట్లో సానుకూల వాతావరణాన్ని నింపింది. దీనికితోడు గత కొంతకాలంగా అంతరాయం ఏర్పడిన ఎర్ర సముద్రపు సరుకు రవాణా మార్గాల ద్వారా చమురు ఎగుమతులు మళ్లీ పునరుద్ధరించబడటం అంతర్జాతీయంగా చమురు కొరత భయాలను తొలగించింది. సరఫరా మార్గాలు సజావుగా మారడంతో క్రూడాయిల్ లభ్యత పెరిగి, అంతర్జాతీయ బెంచ్ మార్క్ లైన బ్రెంట్ మరియు డబ్ల్యూటీఐ ధరలు గణనీయంగా దిగిరావడానికి మార్గం సుగమమైంది.వారం రోజుల క్రితం మధ్యప్రాచ్యంలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితులు ,సరికొత్త పరిణామాలతో అమెరికా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఖతార్ మధ్యవర్తిత్వంతో అమెరికాతో యుద్ధాన్ని ముగించేందుకు తాము ఏడు ప్రధాన షరతులను ప్రతిపాదించినట్లు ఇరాన్ ప్రకటించింది. యుద్ధం పూర్తిగా నిలిచిపోవాలని, ఫ్రీజ్ చేసిన ఇరాన్ నిధులను విడుదల చేయాలని, అలాగే ఇరాన్ ఓడరేవులపై అమెరికా అమలు చేస్తున్న నావికా దిగ్బంధాన్ని ఎత్తివేయాలని టెహ్రాన్ డిమాండ్ చేస్తోంది. మరోవైపు, తాము సరికొత్త యాంటీ-షిప్ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించామని, వాషింగ్టన్ కనుక పూర్తి స్థాయి యుద్ధానికే మొగ్గుచూపితే తాము సిద్ధమేనని ఇరాన్ హెచ్చరించింది.ఈ ఉద్రిక్తతల నీడలోనే యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హూతీ రెబెల్స్ సౌదీ అరేబియాపై దాడులను తీవ్రతరం చేశారు. రాజధాని రియాద్‌లోని అత్యంత సున్నితమైన ప్రాంతాలతో పాటు యాన్బు లోని ప్రముఖ అరామ్‌కో చమురు నిల్వలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు నిర్వహించినట్లు హూతీలు ప్రకటించారు. అయితే, ఈ దాడులను సౌదీ నేతృత్వంలోని కూటమి బలగాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా క్షిపణులను గాలిలోనే ధ్వంసం చేశామని సౌదీ స్పష్టం చేసింది. పౌరులు, పౌరసౌకర్యాలపై హూతీలు చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించిన కూటమి, తగిన రీతిలో బదులిచ్చే హక్కు తమకు ఉందని హెచ్చరించింది.ఈ ప్రాంతంలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితుల కారణంగా, మధ్యప్రాచ్యంలోని తొమ్మిది దేశాలలో ఉన్న అమెరికన్ పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గగనతల మూసివేతలు, విమానాల రాకపోకలు ఆగిపోయే పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని యూఎస్ విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు, సౌదీ అరేబియాను ఈ ప్రాంతీయ యుద్ధంలోకి అనవసరంగా లాగకూడదని టర్కీ అంటోంది. ఇటీవలే కుదిరిన మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం సౌదీకి అవసరమైన సైనిక సహాయాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని టర్కీ అంటోంది.మరో వైపు ట్రంప్ తన వారాంతాన్ని అత్యవసరంగా ముగించుకుని క్యాంపు డేవిడ్ కు చేరుకున్నారు. ఈ పరిణామాల మధ్యే దౌత్యపరమైన మంతనాలు కూడా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పాకిస్థాన్ మినిస్టర్ మొహ్సిన్ నఖ్వీ టెహ్రాన్ వెళ్లనున్నారు. అయితే అమెరికా ప్రతిపాదనలకు సంబంధించిన ఎలాంటి అధికారిక సమాచారాన్ని ఆయన మోసుకొని రావడం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఏది ఏమైనప్పటికీ, హూతీల క్షిపణి దాడులు, ఇరాన్-అమెరికా మధ్య నడుస్తున్న మాటల యుద్ధం, గ్లోబల్ షిప్పింగ్ రూట్లపై పెరుగుతున్న నీడలు మిడిల్ ఈస్ట్‌ను మరోసారి అత్యంత ప్రమాదకర అంచున నిలబెట్టాయి.

హామీలు అమలు చేయకుంటే విలువేముంది?



ప్రజా పాలన, ఇందిరమ్మ పాలన అంటూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో మూడుసార్లు ప్రభుత్వ ఉద్యోగులకు హామీలు ఇచ్చారు. కానీ వాటిని నేటివరకూ నెరవేర్చకపోయారంటే ఇక ఆ పదవికి విలువేమున్నది? కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని హామీలు, ఉద్యోగులకు హక్కుగా, న్యాయంగా రావలసిన ప్రధాన సమస్యలను పరిష్కరించాలని రెండున్నరేండ్ల నుంచి పెన్షనర్ల జేఏసీ, బాధిత పెన్షనర్ సంఘాలు, ఉద్యోగులు అనేక పర్యాయాలు ఉద్యమాలు చేపట్టారు. పెన్షనర్ల జేఏసీ ఇప్పటికే మూడు పర్యాయాలు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో మహాధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా 207 సంఘాలతో ఉన్న టీజీఈజేఏసీ రాష్ట్ర నాయకత్వం కిందిస్థాయి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఒత్తిడి మేరకు అనివార్యంగా నిరుడు మే నెలలో, ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఈ నేపథ్యంలో మే 2న సీఎం నాలుగు హామీచ్చారు. మూడు నెలలైనా ఆ హామీల అమలు అతీగతీ లేకపోవడంతో పెన్షనర్ల జేఏసీ గత నెల 7న వేలాదిమందితో మహాధర్నా చేపట్టింది. కింది స్థాయి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఒత్తిడి మేరకు, విధి లేని క్రమంలో ఆగస్టు, సెప్టెంబర్‌లో మూడు దశల పోరాట కార్యక్రమాన్ని తీసుకుని చివరగా ఈనెల 10వ తేదీన ఎల్బీ స్టేడియంలో మహాధర్నా ప్రకటించారు. మహాధర్నా విజయవంతం కోసం వివిధ జిల్లాల్లో ఉద్యోగులు, పెన్షనర్లతో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి లక్షలాదిమందిని కదిలించారు.

ఉద్యమ తీవ్రతను చూసి ఇంటెలిజెన్స్ రిపోర్టు ఆధారంగా మహాధర్నా జరుగకూడదని ముఖ్యమంత్రి నిశ్చయించుకుని, ఉధృతంగా ఉన్న ఉద్యమాన్ని నీరుగార్చడానికి ఈనెల 18న చర్చలు జరుపుతామంటూ పీఆర్సీ చైర్మన్‌కు పీఆర్సీ రిపోర్టు సబ్మిట్ చేయాలని లెటర్ రాశారు. ఆ తర్వాత మహాధర్నాను వాయిదా వేయించి, ఈనెల 17, 18 తేదీల్లో జరుగాల్సిన చర్చలను 21 తేదీకి వాయిదా వేశారు. అయితే, ఈ తాజా చర్చల్లో ముఖ్యమంత్రి పాల్గొనపోవడం ఉద్యోగులను మోసగించడమే అయ్యింది. మళ్లీ ఈనెల 22న చర్చలు జరుగుతాయంటూ ప్రకటించినా అందుకు సీఎం ముందుకు రాలేదు. చర్చలు మళ్లీ ఈనెల 23న జరుగుతాయని మళ్లీ వాయిదా వేశారు. కేవలం కాలయాపన కోసమే ఈ సర్కార్ నాటకాలు ఆడుతున్నదని ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులు ఎలాంటి ఉచిత పథకాలు అడుగడం లేదు. గొంతెమ్మ కోరికలూ కోరడం లేదు. వారికి న్యాయంగా, హక్కుగా రావలసినవి మాత్రమే అమలు చేయాలని వేడుకుంటున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ప్రధానమైన పీఆర్సీ ఆచరణకు నోచుకోవడం లేదు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు నెలల్లో పీఆర్సీ అమలు చేస్తామన్నారు. 2026 జూలై వరకు 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతవరకు ఇన్ని డీఏలు పెండింగ్‌లో లేవు.

రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ దవాఖానల్లో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అమలు చేస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. అయినా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల నుంచి 1.5 శాతం నాలుగు నెలలుగా కాంట్రిబ్యూషన్ వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం సరిగా అందించడం లేదు. అంటే ఉద్యోగుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ, చిత్తశుద్ధి లేవని అనుకోవాల్సి వస్తున్నది. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం, ఇందిరమ్మ పాలన, ప్రజాపాలన అని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఆవేదనతో ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దుపరచి పాత పెన్షన్ విధానాన్ని అమలుపరుస్తామన్న హామీ ఏమైంది? కొన్ని రాష్ట్రాల్లో ఈ విధానం ఎంతోకాలం నుంచి అమలవుతున్నది. కానీ మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదు? 2024 మార్చి నుంచి ఇప్పటివరకు రిటైరైన ఉద్యోగులకు పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించలేదు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు అన్నింటినీ చెల్లించలేదు. ఈ నేపథ్యంలో వీటన్నింటి అమలుకు ప్రతినెలా రూ. 2 వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. కాంగ్రెస్ ఉద్యోగ జేఏసీ నాయకులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, స్వార్థరహితంగా, నిస్వార్థంగా, సమర్థవంతమైన ఉద్యోగ సంఘ నాయకులుగా ఉద్యోగుల శ్రేయస్సు, సంక్షేమం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతారని, రాష్ట్రంలోని దాదాపు 13 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వంతో చర్చలు విఫలమైనట్టయితే, తక్షణమే ఉద్యోగ జేఏసీ నాయకులు సమ్మె నోటీసు ఇచ్చి, ఉద్యోగులు పెన్‌డౌన్, ఉపాధ్యాయులు పాఠశాలలకు సామూహిక సెలవులు పెట్టి ఉద్యమ కార్యాచరణ ప్రకటించాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మెలో ఏ విధంగానైతే పాల్గొన్నామో, ఆ విధంగానే హక్కుల సాధన కోసం ఉద్యమించేలా కృషి చేయాలి.

చమురు రంగంలో తెలుగు సంస్థలు



దేశ సరిహద్దులకు ఆవల ప్రపంచవ్యాప్తంగా భారత వాణిజ్య విజయం అంటే సహజంగా ఐటీ రంగ దిగ్గజ సంస్థలే గుర్తుకు వస్తాయి. ఈ సంస్థలు సకాలంలో మెరుగైన సేవలు అందించి లాభాలు ఆర్జిస్తున్నాయి; భారత యువజనులకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్నాయి; మరీ ముఖ్యంగా భారతీయుల ప్రతిభా పాటవాలకు అంతర్జాతీయంగా ఎనలేని గుర్తింపును సాధిస్తున్నాయి. ఈ కారణంగానే సమకాలీన భారతీయ వాణిజ్య విజయాలకు ఐటీ సంస్థలు ప్రతీకలుగా వెలుగొందుతున్నాయి. ఇటీవల కొంతకాలంగా ఐటీ సంస్థలకు అదనంగా భారతీయ ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల సంస్థలూ విదేశాలలో విజయవంతంగా విస్తరిస్తున్నాయి. ఇది శుభ పరిణామం. ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రపంచంలో అగ్రభాగాన నిలిచే చమురు నిక్షేపాల నెలవులు అయిన గల్ఫ్ అరబ్బు దేశాలలో ఈ సంస్థలు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి.

వాస్తవానికి భారతీయ ఇంజినీరింగ్, నిర్మాణ రంగ సంస్థలకు అరబ్బు దేశాలు కొత్త కాదు. చమురు ఎగుమతి ఆరంభ కాలం (1970వ దశకం)లో టాటా గ్రూప్ భాగస్వామి అయిన అగ్రగామి కాంట్రాక్టింగ్ కంపెనీ 'షాపూర్జీ పల్లోంజీ' గల్ఫ్ దేశాలలో సివిల్ నిర్మాణాలను విరివిగా చేపట్టింది. ఈ ఎడారి దేశాలలో మట్టి సరిగ్గా అందుబాటులో ఉండదు. దీంతో అవసరమైన మట్టిని షాపూర్జీ పల్లోంజీ కంపెనీ భారతదేశం నుంచి నౌకలలో తీసుకువచ్చేది. అప్పుడే ఆ కంపెనీ యువ ఇంజినీరు ఎ.పి.జితేందర్ రెడ్డిని కూడా ఉద్యోగ వీసాపై గల్ఫ్‌కు తీసుకువచ్చింది. సుదీర్ఘకాలం అరబ్బు దేశాలలో ఉన్న జితేందర్ దేశానికి తిరిగి వెళ్లి పార్లమెంటుకు పోటీ చేసి ఎన్నికయ్యారు. ఎలక్ట్రో--మెకానికల్ రంగంలో ప్రముఖ భారతీయ సంస్థ 'ఎల్ అండ్ టీ' పూర్తి చేసిన 65 బిలియన్ డాలర్ల విలువైన పనులలో దాదాపు సగం సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్ దేశాలకు చెందినవే కావడం విశేషం. ఎడారి ఉష్ణోగ్రతలో ఎయిర్ కండిషన్ ఇంజినీరింగ్ భారీ కాంట్రాక్టులను ప్రపంచ దిగ్గజ బహుళజాతి సంస్థలతో పోటీపడి ఎల్ అండ్ టీ విజయవంతంగా పూర్తిచేసింది. మారుమూల ఇసుక ఎడారుల గుండా హైవోల్టేజీ విద్యుత్ లైన్ల నిర్మాణంలో కూడా ఎల్ అండ్ టీ తన విశిష్టతను చాటింది. గల్ఫ్ దేశాలలో పైపులైను వ్యవస్థ అత్యంత కీలకమైనది. నీటి వనరులు లేని ఈ ఎడారి దేశాలలో వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర తీరం నుంచి శుద్ధి చేసిన ఉప్పు నీటిని నగరాలకు సరఫరా చేయడం, చమురును నౌకాశ్రయాల వరకు రవాణా చేయడానికి పైపులు ప్రధాన ఆధారాలు. ఈ పైపుల నిర్మాణం, సరఫరా పనుల్లో భారతీయ సంస్థలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. చమురు పైపుల నిర్మాణం, నిర్వహణలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన నిపుణులు పెట్టింది పేరు.

గల్ఫ్ దేశాలు అంటే చమురు, గ్యాస్‌కు మారుపేరు. ఈ దేశాలలో ప్రతి వ్యవస్థ ఈ రంగంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుసంధానమై ఉంటుంది. నిరంతర విస్తరణ, నిర్వహణ పనులు ఉండే ఈ రంగంలో ఇప్పటి వరకు భారతీయ సంస్థలు ఏవీ కూడా పోటీపడలేదు. సాధారణంగా అమెరికా, జర్మనీ, బ్రిటన్ దేశాల ఇంజినీరింగ్ సంస్థలే ఇందులో సదా అగ్రగాములుగా ఉంటాయి. ప్రప్రథమంగా భారతీయ సంస్థలు అందునా తెలుగు రాష్ట్రాలకు చెందిన సంస్థలు చమురు రంగంలో సాహసోపేతంగా అడుగుపెడుతున్నాయి. చమురు ఉత్పాదకతలో విడుదలయ్యే వివిధ రసాయనాలను వేరు చేస్తూ నికర చమురును తీయడం ఒక ముఖ్య ప్రక్రియ. ఇందుకు అవసరమైన ప్లాంట్లను సాధారణంగా పాశ్చాత్య దేశాల సంస్థలు మాత్రమే నిర్మిస్తాయి. ఈ రకమైన నిర్మాణ పనుల కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్ సంస్థ కువైత్‌లో దక్కించుకుని ప్రపంచ ఇంజినీరింగ్ సంస్థలను ఆశ్చర్యానికి గురిచేసింది. 381 మిలియన్ డాలర్ల ఈ కాంట్రాక్టు చమురు రంగంలో భారతీయ సంస్థల ప్రాబల్యానికి ఒక తిరుగులేని నిదర్శనం. ఇంతకు ముందూ కువైత్ చమురు సంస్థ నౌకదానిలో 225 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును మేఘా సంస్థే దక్కించుకుంది. సౌదీలో 300 కిలోమీటర్ల పైపు లైను ద్వారా మక్కా పుణ్యక్షేత్రానికి ఐదు లక్షల క్యూసెక్కుల మంచి నీరు సరఫరా చేసే అర్హత పొందిన సంస్థల జాబితాలో కూడా మేఘా ఉన్నది.

తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రోగ్రెసివ్, రాంకీ, జి.యం.ఆర్ సంస్థలు గతంలో వివిధ రంగాలలో కొన్ని పనులు చేసినా కీలకమైన చమురు రంగంలో మేఘా ప్రవేశమే భారతీయ కంపెనీలకు ఒక కొత్త ప్రారంభమని చెప్పవచ్చు. భారత వాణిజ్య విజయాలలో ఇదొక ఉజ్వల అధ్యాయం. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ ఐటీ సంస్థల జైత్రయాత్రను ఇంజినీరింగ్ సంస్థలూ కొనసాగించాలి.

‘సర్’పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే

దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్?ఐఆర్?)లో పలు రాష్ట్రాల్లో ఓటర్ల పేర్ల తొలగింపుపై ఎన్నికల కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన మీడియా కథనంపై ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. కమిషన్ జారీచేసే అన్ని అధికారిక ఆదేశాలు, నిర్ణయాలు, పరిపాలనాపరమైన సూచనలకు పూర్తి చట్టబద్ధత ఉంటుందని వెల్లడించింది. సర్ ప్రక్రియపై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే అని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకుతావులేదని ఈసీ తెలిపింది. ఇవన్నీ ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం నిర్దేశించిన చట్టబద్ధమైన విధానాల ప్రకారమే జరుగుతాయని తెలిపింది. అయితే, ఏ సంస్థలోనైనా నిర్ణయాలు తీసుకునే ముందు జరిగే చర్చల్లో భిన్నాభిప్రాయాలు సాధారణమేనని పేర్కొంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో తన రాజ్యాంగవిధులను పూర్తి చిత్తశుద్ధితో నిర్వర్తించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఈసీ పునరుద్ఘాటించింది. ముసాయిదా దశలో కమిషన్ సభ్యులు అడిగే ప్రశ్నలు లేదా ఇచ్చే సూచనలు, ఓటర్ల హక్కులను కాపాడేందుకు చేసే పరిపాలనా ప్రక్రియలో భాగమేనని వివరించింది. ఎన్నికల వ్యవస్థను మెరుగుపరచటానికి కేవలం ముగ్గురు కమిషనర్లు మాత్రమే కాకుండా కమిషన్‌లో ప్రతి అధికారి సూచనలు ఇవ్వటానికి పూర్తి అధికారం కలిగి ఉన్నారని ఈసీ స్పష్టం చేసింది.

అసలేం జరిగింది?

ఎస్ఐఆర్ ప్రక్రియ దేశవ్యాప్త అమలు ముగ్గురు కమిషనర్ల పర్యవేక్షణలో జరుగుతోంది. అయితే, ఈ? ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లలో ఇద్దరైన సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, పదేపదే ప్రశ్నలు లేవనెత్తారని ఓ వార్తా పత్రిక ఇటీవల వెల్లడించింది. తమకు తెలియకుండానే తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాలపై సుఖ్?బీర్? సింగ్?, వివేక్? జోషి గత 10 నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆ వార్తా పత్రిక నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. సర్ ప్రక్రియలో సీఈసీ



జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠను, విశ్వసనీయతను ఆయన పూర్తిగా దిగజార్చారని ఆరోపించాయి. తక్షణమే ఆయన్ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. ఈసీని ఏదో అదృశ్యశక్తి నడిపిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. మెజారిటీ సభ్యుల ఆమోదం లేకుండా తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకపక్షంగా భావించాల్సి ఉంటుందని పేర్కొంది. ఓటుచోరీ ద్వారా బీజేపీ, ఆర్?ఎస్?ఎస్?, ఈసీ దేశద్రోహానికి పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్? గాంధీ బుధవారం ఆరోపించారు. ఓట్ల చోరీ అనేది రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి అని దయ్యబట్టారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఈసీ అధికారులను గతంలో హెచ్చరిస్తూ తాను చేసిన వ్యాఖ్యలను ఎక్స్? పోస్టులో పేర్కొన్నారు.

కోట్లాది మంది పేర్లను తొలగించి, బోగస్ ఓట్లను చేర్చారు!

మరోవైపు, పైస్థాయి నుంచి వచ్చిన ఆదేశాలతో కోట్లాది మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించి, బోగస్ ఓట్లను చేర్చారని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. సర్ ప్రక్రియను రద్దు చేసి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలని ఆప్ జాతీయ సమన్వయకర్త కేజ్రీవాల్ అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఈసీ ఏకచ్ఛత్రాధిపత్యంగా మారిందని సీపీఎం దుయ్యబట్టింది. వెంటనే పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి సీఈసీ అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ జైలుకు వెళ్లటం ఖాయమని శివసేన-యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ జోస్యం చెప్పారు. ఆయనను వెనుక ఉండి నడిపిస్తున్న పెద్దలు దేశం విడిచి పారిపోవడం ఖాయమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సీఈసీని అభిశంసించాల్సిన సమయం ఆసన్నమైందని టీఎంసీ రాజ్యసభాపక్ష నేత డెరిక్ ఒబ్రెయిన్ అన్నారు.

ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై బీజేపీ

భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులకు అధిష్ఠానం రాష్ట్రాల బాధ్యతలను అప్పగించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు కొత్తగా ఇన్‌ఛార్జిలను, కో-ఇన్‌ఛార్జిలను నియమించింది. ఏపీకి ఇన్‌ఛార్జ్?గా అరవింద్ భదౌరియా, తెలంగాణ ఇన్‌ఛార్జ్?గా సునీల్ భన్సల్‌ను నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బంగాల్ బాధ్యతలను కూడా సునీల్ భన్సల్‌కు అప్పగించారు. అనిల్ బలూని బీజేపీ కమ్యూనికేషన్ సెల్ కో-ఆర్డినేటర్‌గా, ఆశిష్ అగర్వాల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ చేసిన ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయి అని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. దేశ రాజధాని దిల్లీకి వినయ్ సహస్రబుద్ధేను ఇన్‌ఛార్జిగా నియమించారు. సీనియర్ బీజేపీ నేత వినయ్ సహస్రబుద్ధే దిల్లీకి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించనుండగా, జమ్యాంగ్ సెరింగ్ నామ్‌గ్యాల్, దర్శన జర్దోష్ సహ-ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారు. హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లకు స్మృతి ఇరానీ ఇన్‌ఛార్జ్?గా వ్యవహరించనున్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ఒడిశా ఇన్‌ఛార్జ్?గా బాధ్యతలు అప్పగించారు. పార్టీ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్‌కు తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాల బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలపైన బీజేపీ దృష్టి సారించారు. ఈ మేరకు బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్



తావ్డేను ఉత్తరప్రదేశ్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. జగదీష్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ వర్మ, ఆనంద్ ఓజా సహ-ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న మరో రాష్ట్రమైన గుజరాత్‌కు రాజ్యసభ ఎంపీ తరుణ్ చుగ్ ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. పంజాబ్‌తో పాటు జమ్మూ కాశ్మీర్‌కు సతీష్ పూనియాను ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. దిల్లీ బీజేపీ మాజీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా, రాజ్యసభ ఎంపీ అల్కా గుర్జార్‌లను సహ-ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు. అటు ఎన్నికలు జరిగే మణిపుర్ బాధ్యతలను అసోంకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజీవ్ రాయ్‌కు అప్పగించారు. కేంద్ర మాజీ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్‌కు గోవా బాధ్యతలు అప్పగించారు.

బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంతి జై పాండాను మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా నియమించగా, అమిత్ మాలవీయ, సదానంద షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ సహ-ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులయ్యారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి హరియాణ, ఛత్తీస్‌గఢ్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించగా, మరో జాతీయ ప్రధాన కార్యదర్శి హరీష్ ద్వివేది బిహార్, కర్ణాటక రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తారు. జాతీయ కార్యదర్శి స్వదేశ్ సింగ్ సహ-ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తారు. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ కుమార్ దేబ్‌ను మధ్యప్రదేశ్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు.

కొత్త టీమ్‌తో ఎన్నికల వ్యూహం

ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త టీమ్‌ను ఇటీవలె ప్రకటించారు. అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ కొత్త బృందాన్ని నియమించారు. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా అమేఠీ మాజీ ఎంపీ స్మృతి ఇరానీ, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ కుమార్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, సతీశ్ పూనియా, గజేంద్ర పటేల్, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాలకు కీలక బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో పలువురు సీనియర్ నేతలను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. మాజీ రాజస్థాన్ సీఎం వసుంధరా రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ పాండా, డీ పురందేశ్వరి తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కింది. మొత్తం 13 మంది కొత్త ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం విశేషం.

సరిహద్దు ఉగ్రవాదాన్ని పరిష్కరించాలి!

భారత్ అంతర్గత విషయాలపై మాట్లాడే అధికారం ౫×జకి లేదని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు పూర్తిగా భారత్‌లో అంతర్భాగమని, రాజకీయ ప్రేరేపిత ప్రచారాలతో ఈ వాస్తవాన్ని ఎప్పటికీ మార్చలేరని భారత విదేశాంగ శాఖ కుండబద్దలు కొట్టింది. న్యూయార్క్‌లో జరిగిన ౫×జ కాంటాక్ట్ గ్రూప్ భేటీకి అజర్‌బైజాన్, పాకిస్థాన్, తుర్కియే, సౌదీ అరేబియా, నైగర్ విదేశాంగమంత్రులు హాజరయ్యారు. సమావేశం తర్వాత విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో భారత్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను విదేశాంగ శాఖ తోసిపుచ్చింది. ప్రేరేపిత కథనాలను ౫×జ పదేపదే సమర్థించడం ఆ సంస్థ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించింది. తప్పుడు ప్రచారానికి వేదిక కల్పించడం మానుకొని ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న పాకిస్థాన్‌కు సరైన సలహా ఇవ్వాలని ౫×జకి సూచించింది.

ఇందుకు సంబంధించి విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ పోస్టులో స్పందించారు. “భారతదేశానికి పూర్తిగా అంతర్గతమైన విషయాలపై తీర్పు చెప్పడానికి ౫×జకి ఎటువంటి అధికారమూ లేదు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు భారత్?లో అంతర్భాగం. రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతగా ప్రచారం చేసినా ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరు” అని తేల్చి చెప్పారు.? వ్యతిరేక ప్రచారాల కోసం తమ వేదికను ఉపయోగించుకోవద్దని, దానికి బదులుగా ఈ ప్రాంతంలో అస్థిరతకు మూలకారణమైన సరిహద్దు ఉగ్రవాదాన్ని పరిష్కరించాలని భారత్? ఓఐసీని కోరింది. “భారత్?పై బురదజల్లేందుకు పాకిస్థాన్‌కు అవకాశం ఇవ్వడానికి బదులుగా, ఆ దేశానికి తగిన బుద్ధి చెప్పాలి. సరిహద్దు



ఉగ్రవాదానికి మద్దతు ఇస్తూ, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న రికార్డు పాకిస్థాన్‌కు ఉంది. తొలుత పాకిస్థాన్ తన భూభాగంలో ఉన్న ఉగ్రవాద ముప్పుపై దృష్టి సారించి, అంతర్గత సమస్యలను పరిష్కరించుకునేలా ఓఐసీ కౌన్సిలింగ్ ఇవ్వాలి” అని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

పరిస్థితులు దారుణంగా ఉన్నాయి!

గతేడాది మే నెలలో జరిగిన పహల్గాం దాడికి వ్యతిరేకంగా భారత్ జరిపిన సైనిక చర్యను ఈ కూటమి తప్పుబట్టిందని భారత్ పేర్కొంది. ఉగ్రవాదాన్ని సమర్థిస్తూ, పాకిస్థాన్ ప్రభుత్వానికి సంఘీభావం తెలపడం ఓఐసీ పక్షపాత వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించింది. అంతేకాకుండా, పాక్? ఆక్రమిత జమ్మూకశ్మీర్, గిల్గిట్-బాల్టిస్థాన్?లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ముఖ్యంగా, పెరుగుతున్న ఇంధన ధరలు, బలహీనమైన పర్యటక కార్యకలాపాలు, దీర్ఘకాలిక ఆంక్షల కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాక్? ఆక్రమిత జమ్మూకశ్మీర్ నివాసితులు, వ్యాపారాలు, విద్యార్థులపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు, పర్యాటకం మాత్రమే ఈ ప్రాంతానికి ప్రధాన ఉపాధి వనరులుగా మిగిలిపోవడంతో పరిస్థితి మరింత కష్టంగా మారిందని పీఓకే స్థానిక నివాసి పేర్కొన్నారు. “పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోంది. లాక్‌డౌన్ ఉంది, ద్రవ్యోల్బణం కూడా పెరుగుతోంది. ఇటీవల పెట్రోల్ ధరల పెరుగుదల జీవన వ్యయాన్ని మరింత పెంచింది. 90 రోజులు గడిచినా, పీఓకేలో ఇప్పటికీ ఇంటర్నెట్ సేవలు లేవు. మొబైల్ సేవలకు అంతరాయం కలగడంతో ప్రజలు కాల్స్ చేసుకోవడం కూడా కష్టంగా మారింది” అని హమీద్ అన్నారు. అయితే, జూన్ నుంచి పీఓకేలో పదేపదే జరుగుతున్న నిరసనలతో పాటు ఆర్థిక ఒత్తిళ్లు కూడా తలెత్తాయి. ఈ నిరసనల్లో ధరలు, విద్యుత్ ఖర్చులు, విద్య ఇతర ప్రాథమిక సమస్యలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్ మానవ హక్కుల మండలి, ముఖ్యంగా రావల్కోట్, పూంచ్, సుధనూటి జిల్లాల్లో 100 రోజులుగా కొనసాగుతున్న నిరసనలు, అశాంతిపై ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కౌన్సిల్ పోస్ట్ ప్రకారం, ఈ దీర్ఘకాలిక పరిస్థితి అనిశ్చితిని సృష్టించిందని, పీఓకే అంతటా విస్తృత ప్రభావాన్ని చూపుతోందని తెలిసింది.

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై మంత్రి నారా లోకేశ్ ఫోకస్

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి, విద్యావ్యవస్థలో మెరుగైన ఫలితాలు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిరక్షణకు మిషన్ మోడ్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. దీనికోసం అవగాహన, సంస్థాగత మద్దతు, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం ‘కేర్ ఏపీ’ అనే టూల్‌ను సిద్ధం చేశామని, పైలట్ ప్రాజెక్టు కూడా పూర్తయిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 963 ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షల మంది విద్యార్థులకు ‘హార్ట్‌ఫుల్ యోగా’ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం సంస్థ ద్వారా 2,000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించనున్నామని, ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో, వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో యోగా తరగతులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. పాఠశాల విద్యలో సంస్కరణల దశ ముగిసిందని, ఇకపై అధికారులంతా ఫలితాలపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని లోకేశ్ స్పష్టం చేశారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ‘మిషన్ మార్చ్’ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న అధికారులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. బోధనలో వెనుకబడిన ఉపాధ్యాయులకు మెంటార్ టీచర్లతో శిక్షణ తప్పనిసరి చేయాలన్నారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతం పెంచేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఖీ=ా) అమలు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమైన ‘అక్షర ఆంధ్ర’ ద్వారా వచ్చే ఏడాది చివరికల్లా నూరు శాతం అక్షరాస్యత సాధించాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షించిన మంత్రి, పీఎం సేతు పథకం కింద పారిశ్రామికవేత్తల సహకారంతో తొలి విడతగా 10 పారిశ్రామిక అనుసంధానిత ఐటీఐ క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. స్టీల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఆక్వా, ఫార్మా రంగాల సంస్థలతో సంప్రదించి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గత రెండేళ్లలో జాబ్ మేళాల ద్వారా 1.72 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని, మొత్తం 5.43 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని అధికారులు వివరించారు. ఇకపై జాబ్ మేళాల నిర్వహణలో శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేని వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజమహేంద్రవరం నగరంలో 55 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కారణంగా నగరంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, శ్యామలా సెంటర్, హైటెక్ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రహదారులపై భారీగా వరద నీరు నిలిచిపోయింది. రోడ్లన్నీ చెరువులను తలపిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నీటిలో ప్రయాణించలేక తీవ్ర అవస్థలు పడ్డారు.

గోపాలపురంలో అత్యధిక వర్షపాతం

జిల్లాలోని గోపాలపురం మండలంలో అత్యధికంగా 89 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డైంది. దేవరపల్లి మండలంలో 75.2, నల్లజర్లలో 69, అనపర్తిలో 65.6 మిల్లీమీటర్ల వాన కురిసింది. సీతానగరం, కడియం, చాగల్లు మండలాల్లో 55 మి.మీకి పైగా వర్షం పడింది. రాయవరం, రాజమహేంద్రవరం రూరల్, రంగంపేటలో 50 మి.మీ పైగా వర్షపాతం నమోదైంది. నిడదవోలు, కపిలేశ్వరపురం, పెరవలి, మండపేట, ఉండ్రాజవరం, రాజానగరం, కోరుకొండ మండలాల్లో 36 మి.మీ వర్షం కురిసింది. తాళ్లపూడి, గోకవరం, కొవ్వూరు, బిక్కవోలులో మోస్తరు వర్షం పడుతోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురంతో సహా జిల్లా వ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి.

పర్యాటకులకు నో ఎంట్రీ

పోలవరం జిల్లాలోనూ పలు చోట్ల వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల దృష్ట్యా పొల్లూరు సహా జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల్లో జలపాతాలు ఉప్పొంగుతున్నాయి. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టారు. ఆయా జలపాతాలు, పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను అనుమతించడం లేదు.

24 గంటలూ కంట్రోల్ రూమ్

రానున్న మూడు రోజుల పాటు రంపచోడవరం డివిజన్ పరిధిలో భారీ వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కార్యాలయంలో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సిబ్బందికి షిఫ్టుల వారీగా విధులు కేటాయించారు. వర్షాలు, వరదలు, పిడుగులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు టోల్‌ఫ్రీ నెంబర్ 1800 425 2531 కు ఫోన్ చేసి తెలియజేయాలని అధికారులు సూచించారు.

దక్షిణాఫ్రికాలో దారుణం

దక్షిణాఫ్రికాలో ఘోర కాల్పుల ఘటన చోటుచేసుకుంది. క్వాజులు-నాటల్ ప్రావిన్స్‌లోని క్వామాఖుతా పట్టణంలో దుండగులు జరిపిన కాల్పుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసులు బుధవారం వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, మంగళవారం రాత్రి పట్టణంలోని జికో ప్రాంతంలో ఈ దారుణం జరిగింది. ఒక ఇంట్లో 13 మంది పురుషులు, ఓ గర్భిణీ పార్టీ చేసుకుంటుండగా, ముగ్గురు సాయుధ దుండగులు ఒక్కసారిగా లోపలికి ప్రవేశించారు. వారు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో గర్భిణీ సహా 10 మంది అక్కడికక్కడే మరణించారు. గాయపడిన నలుగురిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 11కి చేరింది. ఈ ఘటనపై సౌత్ ఆఫ్రికన్ పోలీస్ సర్వీస్ యాక్టింగ్ నేషనల్ కమిషనర్ ఫులెంగ్ డింపేన్ తీవ్రంగా స్పందించారు. నిందితులను పట్టుకునేందుకు 72 గంటల ప్రత్యేక ఆపరేషన్‌కు ఆదేశించారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమీకరించి, ఈ అమానుషానికి పాల్పడిన వారిని త్వరితగతిన పట్టుకుని న్యాయస్థానం ముందు నిలబెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రాథమిక దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మృతుల్లో కొందరికి నేరచరిత్ర ఉన్నట్లు, వారు చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు పోలీసు క్రైమ్ ఇంటెలిజెన్స్ విభాగం రికార్డులను బట్టి తెలుస్తోంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా ఆ వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. కాల్పులకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని వారు పేర్కొన్నారు. కాగా, ఇదే ప్రావిన్స్‌లోని దర్బన్‌లో గత ఏప్రిల్‌లో జరిగిన మరో కాల్పుల ఘటనలో ఇద్దరు మరణించారు.

సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే!

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో

వైద్య చికిత్సకు రూ.4 లక్షల ఎల్ఓసీ అందజేత



విజయవాడ, మహానగర్

పశ్చిమ పరిధిలోని విద్యాధరపురం కామకోటి నగర్‌కు చెందిన పటాపంచల హనుమంతరావు (57) హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స కోసం వైద్య సాయం కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, 42వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పత్తి నాగేశ్వరరావుతో కలిసి ఎల్ఓసీని బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. తమ విజ్ఞప్తిపై త్వరితగతిన స్పందించి ఎల్ఓసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.1.27 లక్షల కోట్లతో సెమికాన్ 2.0



న్యూఢిల్లీ, మహానగర్

దేశంలో చిప్‌ల తయారీ, పరిశోధనలను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1.27 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌తో 'సెమికాన్ 2.0' విధానాన్ని ప్రారంభించింది. న్యూఢిల్లీలోని యశోభూమిలో జరిగిన 5వ ఎడిషన్ 'సెమికాన్ ఇండియా 2026' సదస్సులో దాదాపు 7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.58 వేల కోట్లు) పెట్టుబడి ఒప్పందాలు కుదిరాయి. ఈవై--ఐఈఎస్ఏ నివేదిక ప్రకారం భారత సెమీకండక్టర్ మార్కెట్ 2035 నాటికి 200 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది. సెమీ ఇండియా, ఐఈఎస్ఏ అధ్యక్షుడు అశోక్ చందక్ మాట్లాడుతూ సెమికాన్ 1.0 దేశీయ సెమీకండక్టర్ రంగానికి పునాది వేయగా, సెమికాన్ 2.0 చిప్ డిజైన్, మెటీరియల్స్, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, పరిశోధన, అభివృద్ధిపై మరింత దృష్టి సారిస్తోందన్నారు. సదస్సుకు 52 దేశాల నుంచి ప్రతినిధులు హాజరుకాగా, 51,656 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 600కు పైగా సంస్థలు ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. మొత్తం 54 వ్యూహాత్మక ఒప్పందాలు జరిగాయి. టాటా ఎలక్ట్రానిక్స్ వేఫర్ తయారీ, అసెంబ్లీ, టెస్టింగ్, కెమికల్స్ సరఫరా కోసం అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు చేసుకోవడంతోపాటు గుజరాత్‌లోని ధోలేరాలో వెండర్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఎల్‌అండ్‌టీ సెమీకండక్టర్స్ తమ చిప్‌లను ప్రదర్శించింది. మొహాలీలోని సిడీఐఎల్, సూరత్‌లోని సుచి సెమికాన్ సంస్థల్లో కమర్షియల్ ప్రొడక్షన్ లైన్లు ప్రారంభం కావడం దేశీయ చిప్ తయారీ రంగంలో కీలక పరిణామంగా నిలిచింది. సెమికాన్ 2.0 ద్వారా దేశవ్యాప్తంగా లక్షకు పైగా ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి

- కొల్లూరు వెంకటేశ్వరరావు డిమాండ్



విజయవాడ, మహానగర్

ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన ఓ అధికారిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని సామాజికవేత్త, వ్యాపారవేత్త, న్యాయవాది, పల్లవి కార్ ట్రావెల్స్ ప్రొప్రైటర్ కొల్లూరు వెంకటేశ్వరరావు కోరారు. నగరంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు 20 ఏళ్లుగా ట్రావెల్స్ వ్యాపారం ఉందని, ప్రభుత్వ అనుమతితో వీఐపీలకు కార్లు సమకూర్చుతున్నట్లు తెలిపారు. 2016లో కాపు కార్పొరేషన్‌లో కారు కాంట్రాక్ట్‌కు సంబంధించి తనకు ఇబ్బందులు ఎదురయ్యాయని, సుమారు రూ.3 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన సదరు అధికారిపై ఉద్యోగ నియామకాలు, వాహనాల ఒప్పందాలు, అంబులెన్స్‌లు, ఇతర కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు చేశారు. ఫేక్ విద్యా సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇప్పించడం, విదేశీ విద్యా రుణాలు, ఉద్యోగ నియామకాల్లో కమిషన్లు వసూలు చేయడం వంటి ఆరోపణలు కూడా చేశారని తెలిపారు. పశుసంవర్ధక శాఖలో రూ.50 నుంచి రూ.100 కోట్ల వరకు అవినీతి జరిగిందని, మొత్తం అక్రమాలు సుమారు రూ.200 కోట్ల వరకు ఉండవచ్చని ఆరోపించారు. తన కుమారుడి ద్వారా ఇన్నోవా క్రిస్టా వాహనాన్ని నెలకు రూ.60 వేల చొప్పున 11 నెలలకు ఇచ్చేలా ఒప్పందం చేసుకుని, అధిక మొత్తంతో బిల్లులు చేశారని ఆరోపించారు. తన బంధువుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.5 లక్షలు తీసుకున్నారని, ఉద్యోగం ఇవ్వలేదని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఫిర్యాదు చేయగా సీఎంఓ నుంచి విజయవాడ పోలీస్ కమిషనర్‌కు లేఖ వచ్చి ఎఫ్ఐఆర్ నమోదైందని వెంకటేశ్వరరావు తెలిపారు. తన వద్ద ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, సీఎంఓ స్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యుల నుంచి రికవరీ చేయడంతో పాటు సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు రావాల్సిన రూ.35 లక్షల బిల్లులు, ఉద్యోగం కోసం ఇచ్చిన డబ్బును ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, సమావేశంలో చేసిన ఆరోపణలకు సంబంధించి సంబంధిత అధికారి లేదా శాఖల నుంచి వివరణ వెల్లడికాలేదు.

యువత ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి





విద్య, ఉపాధి, క్రీడలకు ప్రాధాన్యత

యువత సూచనలతో భవిష్యత్ కార్యాచరణ

యువత భవితకు భరోసా కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

విజయవాడ, మహానగర్

యువత ఆకాంక్షలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్య, ఉపాధి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో మరింత ప్రాధాన్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో బుధవారం నిర్వహించిన 'యువత భవితకు భరోసా' ముఖాముఖి కార్యక్రమంలో ఎంపీ పాల్గొని విద్యార్థులతో నేరుగా సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్య, ఉపాధి, మౌలిక వసతులు, క్రీడలు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలు, సూచనలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కళాశాల భవన నిర్మాణం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఏఐ వంటి కొత్త టెక్నాలజీ ల్యాబొరేటరీల ఏర్పాటు, ఉద్యోగ నియామకాలకు స్పష్టమైన జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ తదితర అంశాలను ప్రస్తావించారు. క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, నూతన స్టేడియాల నిర్మాణం, రాజకీయాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని కూడా వివరించారు. విద్యార్థులు లేవనెత్తిన అంశాలపై ఎంపీ స్పందిస్తూ యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా సంస్థల్లో ఆధునిక సాంకేతిక సదుపాయాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉద్యోగ నియామకాల విషయంలో యువతలో అపోహలు, ఆందోళనలు అవసరం లేదని, అర్హతలు, నిబంధనల ప్రకారం పారదర్శక నియామక ప్రక్రియకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా అధికారిక వర్గాలు వెల్లడించే సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ ఉన్న యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత విద్యతోపాటు క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక రంగాల్లో ముందుకు సాగితే దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని తెలిపారు. రాజకీయాలు, ప్రజాసేవలో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన విద్యావంతులు, ప్రతిభావంతులైన యువత ముందుకు వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువతతో ముఖాముఖి నిర్వహించడం ద్వారా వారి ఆలోచనలు, ఆశయాలు, సమస్యలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని, విద్యార్థులు అందించిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అంశాలపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని కేశినేని చిన్ని తెలిపారు. యువత సాధికారత, విద్యా రంగ అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ విజయవాడను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఆయిల్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

నాగాయలంక, మహానగర్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డీజిల్ ఆయిల్ సబ్సిడీని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. మండల పరిధిలోని గుల్లలమోదలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో వేట వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రభుత్వం మంజూరు చేసిన హైస్పీడ్ డీజిల్ ఆయిల్ సబ్సిడీ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మండలంలో 704 మందికి, కోడూరు మండలంలో 22 మందికి కలిపి మొత్తం 726 కార్డులు మంజూరు కాగా, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై కార్డుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న కార్డుల ద్వారా ప్రతి లీటర్ డీజిల్‌కు రూ.9 సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. నెలకు గరిష్టంగా 300 లీటర్ల వరకు ఆయిల్ సబ్సిడీ పొందవచ్చని చెప్పారు. వేట వృత్తిని ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని వేట వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. తీర ప్రాంత గ్రామాలను సమీకృత మత్స్య సంపద సముదాయాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎంపీ వల్లభనేని బాలశౌరి గుల్లలమోదలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.1.65 కోట్ల 83 వేల 800తో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ అభివృద్ధి, సౌకర్యాల కల్పన పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద



యోజన పథకం ద్వారా వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం కలిగిన తీర ప్రాంత మత్స్యకార గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు నియోజకవర్గంలోని సొర్లగొంది, గుల్లలమోద గ్రామాల్లో రూ.4 కోట్ల విలువైన పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. ప్రతిభ, ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ జిల్లా డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, గుల్లలమోద, ఎదురుమొండి, నాచుగుంట ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీల అధ్యక్షులు చింతా పాపారావు, చెన్ను వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ సూర్యచంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు విశ్వనాధపల్లి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ దున్నా రాజేష్, గుల్లలమోద మాజీ సర్పంచ్ నాగిడి కుబేర వర్మ, జనసేన పార్టీ నాయకులు బండ్రెడ్డి హరి, సైకం నాగబాబు, రేవు సువర్ణరాజు, లంకె శ్రీనివాసరావు, విశ్వనాధపల్లి సూర్య, ఫిషరీస్ అసిస్టెంట్లు పి. గోపీరాజు, లేబాక నాగేంద్ర, గోపినాథ్, స్వాతి, విక్టర్ పాల్, సాగర మిత్రలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

టీచర్లపై దాడి ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏపీ ఎన్జీవో నగరశాఖ అధ్యక్షుడు సీహెచ్. సీవీఆర్ ప్రసాద్, కార్యదర్శి ఎస్‌కే. నజీరుద్దీన్

విజయవాడ, మహానగర్

ఉపాధ్యాయులను అవమానించడం, వారిపై దాడులకు పాల్పడటం అత్యంత ఖండనీయమని ఏపీ ఎన్జీవో నగరశాఖ అధ్యక్షులు సీహెచ్. సీవీఆర్ ప్రసాద్, కార్యదర్శి ఎస్‌కే. నజీరుద్దీన్ పేర్కొన్నారు. గురువులపై దాడి చేయడం విద్యా వ్యవస్థపై దాడి చేయడమేనని, వారిని అవమానించడం సమాజాన్ని అవమానించడమేనని సీహెచ్. సీవీఆర్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే హక్కు కలిగి ఉన్నారని, సమస్యలను తెలియజేసేందుకు సాప్ కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. దాడికి పాల్పడిన బాధ్యులను వెంటనే గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులకు తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్‌కే. నజీరుద్దీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల గౌరవం, హక్కులు, భద్రత విషయంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైన ప్రతి సందర్భంలో సంఘం ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను నేర్పే గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. 'గురువు గౌరవం.. సమాజ గౌరవం' అనే భావనను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించరాదని సీహెచ్. సీవీఆర్ ప్రసాద్, ఎస్‌కే. నజీరుద్దీన్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా విధులు నిర్వహించేలా వారి గౌరవం, హక్కులు, భద్రతకు ప్రభుత్వం పూర్తి



భరోసా కల్పించాలని కోరారు.

బిజినెస్

ఆదివారం కూడా పనిచేయనున్న బ్యాంకులు..
మూడు రోజుల సమ్మె నేపథ్యంలో నిర్ణయం



వచ్చే ఆదివారం, సెప్టెంబర్ 27న దేశంలోని బ్యాంకులు పనిచేయనున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకులు ఆదివారం కూడా పని చేస్తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సెప్టెంబర్ 28-30 వరకు మూడు రోజులపాటు బ్యాంకు సిబ్బంది సమ్మె చేయబోతున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రకటించిన సంగతి తెలిసిందే. వరుసగా మూడు రోజులపాటు బ్యాంకులు పని చేయకపోవడం వల్ల వినియోగదారులకు ఇబ్బంది కలుగుతుందని, అందువల్ల ఆదివారం సెలవు రోజైనప్పటికీ బ్యాంకులు పనిచేసేలా నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. ప్రజల బ్యాంకింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. బ్యాంకులు, ఏటీఎంలు సెప్టెంబర్ 27 వరకు పూర్తిస్థాయిలో పని చేయాలని ఇటీవల ఆర్బీఐ ఆదేశించింది. ఈ నెల 26 నాలుగో శనివారం బ్యాంకులు పని చేయవు. అలాగే, 27వ తేదీ ఆదివారం సెలవు. ఆ తర్వాత 28, 29, 30.. ఇలా మూడు రోజులు సమ్మె. దీంతో వరుసగా ఐదు రోజులు సెలవులు రావడం వల్ల వినియోగదారులు ఇబ్బంది పడతారు. అందుకే..సెప్టెంబర్ 27, ఆదివారం బ్యాంకులు పని చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి ఆర్బీఐ కూడా ఆమోదం తెలిపింది. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మాత్రమే ఆదివారం పని చేస్తాయి. సమ్మె వల్ల కలిగే ఇబ్బందుల గురించి వివిధ బ్యాంకులు ముందుగానే వినియోగదారులకు సమాచారం అందిస్తున్నాయి. వినియోగదారులు కూడా ఈ సమ్మెకు అనుగుణంగా ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది.

షేర్లన్నీ అమ్మేసి.. పైన్ ల్యాబ్స్ నుంచి మాస్టర్‌కార్డ్ ఔట్



న్యూఢిల్లీ: గ్లోబల్ పేమెంట్స్ సొల్యూషన్స్ దిగ్గజం మాస్టర్‌కార్డ్ తాజాగా పైన్ ల్యాబ్స్ నుంచి పూర్తిగా వైదొలగింది. బీఎస్ఈ బ్లాక్ డీల్స్ వివరాల ప్రకారం షేరుకి రూ. 187.75 సగటు ధరలో 4.31 శాతం వాటాకు సమానమైన 4,97,24,182 షేర్లు విక్రయించింది. తద్వారా దాదాపు రూ. 934 కోట్లు అందుకుంది. అనుబంధ సంస్థ మాస్టర్‌కార్డ్ ఆసియా పసిఫిక్ పీటీఈ ద్వారా 13 డీల్స్ ద్వారా వాటాను అమ్మివేసింది. కొటక్ మహీంద్రా, ఎడిల్‌వీజ్, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ తదితర మ్యూచువల్ ఫండ్స్‌తోపాటు.. ఐసీఐసీఐ ప్రు డెన్నియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఈ వాటాలను కొనుగోలు చేశాయి. విదేశీ ఇన్వెస్టర్ సంస్థలు గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లీ, సిటీగ్రూప్ గ్లోబల్ సింగపూర్, బీఎన్‌పీ పారిబాస్ అర్బిట్రేజ్, సొసైటీ జనరాలి తదితరాలు సైతం పైన్ ల్యాబ్స్ షేర్లను సొంతం చేసుకున్న జాబితాలో చేరాయి.

'కాస్' సవాళ్లకు సెబీ చెక్!

క్యాష్ మార్కెట్ ముగింపు ధర డీలింక్

క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ రోజు నమోదవుతున్న సెటిల్‌మెంట్ ధరలు, ఇతర ససంబంధిత సమస్యలపై దృష్టి పెట్టింది. ఇందుకు ఈ నెల మొదట్లోనే కన్సల్టేషన్ పేపర్‌ను విడుదల చేసింది. మార్కెట్ పార్టిసిపెంట్ల ఆందోళనలకు తెరదించే ప్రయత్నంలో భాగంగా పబ్లిక్ నుంచి సూచనలు, సలహాలను ఆహ్వానించింది. తద్వారా ఎక్స్‌పైరీ రోజు సెటిల్‌మెంట్ ధరల ఇండెక్స్, సింగిల్ స్టాక్ డెరివేటివ్స్‌లో సవాళ్లకు చెక్ పెట్టే యోచనలో ఉంది. దీనిలో భాగంగా క్యాష్ మార్కెట్ ముగింపు ధరను ఎఫ్‌అండ్‌వో సెటిల్‌మెంట్ ధరలతో డీలింక్ చేయనుంది. అంతేకాకుండా ముగింపు వేలం(కాస్) సమయంలో లైవ్ ఇండికేటింగ్ ఇండెక్స్ విలువలను నిలిపివేయనుంది. ట్రేడర్లు 1 శాతానికి ఎగువన పెట్టే ఆర్డర్లను కొనసాగించేలా నిబంధనలను సవరించడం తదితరాలపై దృష్టిపెట్టినట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తాజాగా వివరించారు. నిర్మాణాత్మక మార్కెట్‌లో భాగంగా తీసుకువచ్?చన కాస్ సంస్కరణలో సవరణలు చేపట్టనున్నట్లు మోర్గాన్ ఇండియా 11వ సదస్సు సందర్భంగా వెల్లడించారు. సెటిల్‌మెంట్ ధర నిర్ధారణలో రెండు అవకాశాలను ప్రతిపాదిస్తున్నట్లు తెలియజేశారు. కంటిన్యుయస్ ట్రేడింగ్ సెషన్(సీటీఎస్)లో చివరి 30 నిమిషాలు, కాస్‌లో చివరి 10 నిమిషాల లావాదేవీలను వాల్యూమ్ వెయిటెడ్ సగటు ధర(వీడబ్ల్యూఏపీ), సెటిల్‌మెంట్ ధరతో మిక్స్



చేయడం(బ్లెండెడ్) వీటిలో ఒకటికాగా.. ఫిక్స్‌డ్ వెయిట్ పద్ధతిలోకాకుండా వాస్తవిక ట్రేడెడ్ విలువ ఆధారంగా మదింపు చేయనున్నారు. రెండో ఆప్షన్‌లో భాగంగా ప్రస్తుత సీటీఎస్ పరిమాణం వీడబ్ల్యూఏపీ మెథడాలజీని కొనసాగించనుంది. అయితే సీటీఎస్‌లో భాగంగా చివరి 30 నిమిషాల లావాదేవీలను మాత్రమే పరిగణిస్తారు.

రిస్కుల్లో భారత ఆర్థిక వృద్ధి.. డీబీఎస్ బ్యాంక్ అంచనా

న్యూఢిల్లీ: భారత ఎకానమీ వృద్ధికి ద్రవ్యోల్బణం, లిక్విడిటీపరమైన రిస్కులు పొంచి ఉన్నాయని డీబీఎస్ బ్యాంక్ వెల్లడించింది. ఇంధనాల ధరలు అధిక స్థాయిలో కొనసాగుతుండటం, కఠినతర ఆర్థిక పరిస్థితులు మొదలైన అంశాల వల్ల కార్యకలాపాలపై ప్రభావం పడనుందని పేర్కొంది. దీనితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో వృద్ధి ఒక మోస్తరు స్థాయికే పరిమితం కావొచ్చని డీబీఎస్ బ్యాంక్ ఈడీ, సీనియర్ ఎకానమిస్ట్ రాధికా రావు విశ్లేషించారు. 2026 ఆర్థిక సంవత్సర వృద్ధి గణాంకాలను 7.8 శాతానికి సవరిస్తూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సర వృద్ధి సగటున 7.3 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. వస్తు, సేవల పన్నుల వసూళ్లు, ఈ--వే బిల్లులు, విద్యుత్ డిమాండ్, డిజిటల్ చెల్లింపులు పటిష్టంగా ఉన్నాయని..కాకపోతే ద్రవ్యోల్బణం కీలక రిస్న?కగా మారుతోందని చెప్పారు. వర్షపాతం సగటు స్థాయి కంటే తక్కువగా ఉండటం, ఎల్ నినో రిస్న?కలు పెరగడం వల్ల పంటల దిగుబడిపై ఒత్తిడి ఎక్కువగా ఉండొచ్చని రాధికా రావు వివరించారు.



చెలరేగిన భారత బౌలర్లు.. 171 పరుగులకే ఆసీస్ ఆలౌట్

ఆస్ట్రేలియా- 'ఎ' జట్టుతో తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత్- 'ఎ' బౌలర్లు అదరగొట్టారు. కంగారూ టాపార్డర్‌ను కకావికలం చేసి ఆది నుంచే చుక్కలు చూపించారు. భారత బౌలర్ల విజృంభణ కారణంగా ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 171 పరుగులే చేసి ఆలౌట్ అయింది.

పుదుచ్చేరి వేదికగా

కాగా భారత్- 'ఎ' జట్టుతో రెండు అనధికారిక టెస్టులు, మూడు అనధికారిక వన్డేలు ఆడేందుకు ఆసీస్ పురుషుల జట్టు ఇండియాకు వచ్చింది. ఇందులో భాగంగా అన్ని మ్యాచ్‌లు పుదుచ్చేరిలో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో మంగళవారం మొదలైన తొలి అనధికారిక టెస్టులో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది.

కుశాగ్రా సెంచరీ

ఓపెనర్ సాయి సుదర్శన్ (57), ఆల్‌రౌండర్ తనుశ్ కొటియాన్ (69) అర్ధ శతకాలు బాదగా.. బుధవారం నాటి రెండో రోజు ఆట సందర్భంగా కుమార్ కుశాగ్రా శతకం పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 240 బంతులు ఎదుర్కొన్న ఈ వికెట్ కీపర్ బ్యాటర్.. 12 ఫోర్ల సాయంతో 113 పరుగులు రాబట్టాడు. మిగిలిన వారిలో అన్షుల్ కాంబోజ్ (23) చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు.

ఆసీస్ టాపార్డర్ కుదేలు

ఫలితంగా భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 117.3 ఓవర్లు ఆడి 334 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ క్రమంలో రెండో రోజు బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆసీస్‌కు ఆది నుంచే షాకులు తగిలాయి. ఓపెనర్ కాంప్‌బెల్ కెల్లావే (2), వన్‌డౌన్ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీనీ (0) పూర్తిగా విఫలం కాగా.. కెప్టెన్ పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (8) కూడా నిరాశపరిచాడు. మరో ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (76 బంతుల్లో 25), జేసన్ సంఘా కలిసి (64 బంతుల్లో 46) ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే, షమ్స్ ములాని సంఘాను అవుట్ చేసి ఈ జోడీని విడదీయగా.. తుషార్ దేశ్‌పాండే కొన్‌స్టాస్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు.

షమ్స్ ములానికి నాలుగు వికెట్లు

ఆ తర్వాత ఆసీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. వికెట్ కీపర్ బ్యాటర్ జోష్ ఫిలిప్ (14) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరగా.. ఆల్‌రౌండర్ లియామ్ స్కాట్ 26





పరుగులు చేయగలిగాడు. మిగిలిన వారిలో ఫెర్గూస్ 13, టాడ్ మర్ఫీ 12, బ్రెండన్ డాగెట్ 13 పరుగులు చేయగా.. కోరే రొచిసియోలి 4 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో బుధవారం నాటి ఆట పూర్తయ్యేసరికి 55.3 ఓవర్లలో ఆసీస్ 171 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ షమ్స్ ములాని నాలుగు వికెట్లతో చెలరేగగా.. స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ తనుశ్ కొటియాన్ రెండు, పేసర్లు తుషార్ దేశ్ పాండే రెండు, అన్షుల్ కాంబోజ్, ప్రఫుల్ హింగే తలా ఒక వికెట్ దక్కించుకున్నారు. ఇక ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్‌కు 163 పరుగుల భారీ ఆధిక్యం లభించింది.

స్పోర్ట్స్

బ్యాడ్మింటన్‌లో కాంస్యంతో సరి..
ఫైనల్‌కు చేరిన రోషిబిన



ఇంటర్నెట్ డెస్క్: ఆసియా క్రీడల్లో నాలుగో రోజు భారత్‌కు నాలుగు పతకాలు వచ్చాయి. వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను రజతం గెలుచుకోగా.. స్కీట్ పురుషుల, మహిళల విభాగంలో కాంస్యాలు వరించాయి. తాజాగా భారత్ ఖాతాలో మరో కాంస్యం వచ్చి చేరింది. బ్యాడ్మింటన్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ సెమీస్‌లో ఓడిపోయింది. దీంతో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. వుషు అథ్లెట్ రోషిబిన అద్భుతం చేసింది. వరుసగా రెండోసారి ఆసియా గేమ్స్ ఫైనల్‌కు చేరుకుంది. గత ఎడిషన్‌లో రోషిబిన రజతం నెగ్గింది. అంతకుముందు 2018లో కాంస్యం సాధించింది.

చైనా చేతిలో ఓటమి..

సెమీస్‌లో భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టుకు తీవ్ర పోటీ ఎదురైంది. డిఫెండింగ్ ఛాంపియన్ చైనా ముందు నిలవలేకపోయింది. చివరికి 1-3 తేడాతో భారత్‌పై చైనా విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో లక్ష్య సేన్ ఓడిపోగా. సాత్విక్ - చిరాగ్ శెట్టి అద్భుతంగా ఆడి తొలి డబుల్స్‌లో గెలిచారు. అయితే, రెండో డబుల్స్‌తోపాటు సింగిల్స్‌లో భారత ప్లేయర్లు తేలిపోయారు. సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి.. డబుల్స్‌లో అర్జున్ - హరిహరణ్ కూడా ఓటమితో భారత్ సెమీస్‌లోనే వెనుదిరిగింది. దీంతో చైనా ఫైనల్‌కు చేరుకుంది.

కబడ్డీలో సెమీస్‌కు..

పురుషుల కబడ్డీ టీమ్ అదరగొట్టేస్తోంది. హ్యాట్రిక్ విజయాలతో సెమీస్‌కు దూసుకెళ్లింది. దీంతో పతకం ఖాయం చేసుకుంది. గ్రూప్ స్టేజ్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఏ దశలోనూ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. చివరికి 48-25 తేడాతో భారత్ విజయం సాధించింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో 11 పతకాలు ఉన్నాయి. అందులో ఒక స్వర్ణం, ఐదు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. పట్టికలో 13వ స్థానంలో ఉంది. చైనా (58), జపాన్ (48), దక్షిణ కొరియా (29), కజక్‌స్తాన్ (14), థాయ్‌లాండ్ (6) టాప్ -5లో కొనసాగుతున్నాయి.



మహేష్ బాబు 'వారణాసి' షూటింగ్ పూర్తి.. ఇక చివరి దశ పనులు జరుపుకుంటున్న రాజమౌళి చిత్రం!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'. గ్లోబల్ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజమౌళి గత చిత్రాలకు భిన్నంగా మరింత విస్తృతమైన ప్రపంచాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల్లో ఒకటిగా 'వారణాసి' నిలుస్తోంది. ఈ సినిమా ద్వారా మహేష్ బాబు తొలిసారి రాజమౌళితో కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లోనే కాకుండా సినీ వర్గాల్లోనూ ఈ చిత్రంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని కథ, పాత్రలు, చిత్రీకరణ, నిర్మాణ విలువలను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే పలు సందర్భాల్లో వెల్లడించింది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. 'వారణాసి'లో మహేష్ బాబు చేయాల్సిన షూటింగ్ భాగం పూర్తయినట్లు తెలుస్తోంది. దీంతో ఇక మహేష్ బాబు తన తదుపరి పనులపై దృష్టి పెట్టేందుకు సిద్ధమవుతున్నారనే చర్చ మొదలైంది. అయితే చిత్ర బృందం నుంచి ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రాజమౌళి సినిమా అంటే ప్రతి సన్నివేశాన్ని అత్యంత జాగ్రత్తగా తెరకెక్కించడం, అవసరమైన స్థాయిలో భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ సన్నివేశాలు రూపొందించడం సహజం. అందుకే 'వారణాసి' షూటింగ్ విషయంలోనూ భారీ షెడ్యూల్స్ కొనసాగుతున్నాయి. మహేష్ బాబు తన భాగాన్ని పూర్తి చేసుకున్నా.. మిగిలిన నటీనటులతో కీలక సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న చిత్రీకరణ ప్రకారం 'వారణాసి' ప్రధాన షూటింగ్ అక్టోబర్ మొదటి వారంలో పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే భారీ స్థాయి నిర్మాణం కావడంతో షూటింగ్ పూర్తయిన తర్వాత కూడా పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక పనులకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సినిమా కథ, నేపథ్యం, పాత్రల వివరాలను చిత్ర బృందం పూర్తిగా రహస్యంగా ఉంచుతోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు, టైటిల్‌కు సంబంధించిన సమాచారం సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ముఖ్యంగా మహేష్ బాబు పాత్ర ఎలా ఉండబోతోంది? ప్రియాంక చోప్రా పాత్ర ఏ స్థాయిలో ఉంటుంది? పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్ర కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతోంది? అనే ప్రశ్నలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

ప్యారడైజ్... నిజమైన ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది లేదన్న నాని



తన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలపై వచ్చిన కోర్టు ఉత్తర్వుల విషయంలో నేచురల్ స్టార్ నాని పూర్తి స్పష్టత ఇచ్చారు. బెంగళూరు కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆర్డర్ కేవలం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో సృష్టించిన ఫేక్ పోస్టులు, బాట్లకు మాత్రమే వర్తిస్తుందని, నిజమైన ప్రేక్షకుల అభిప్రాయాలకు కాదని తేల్చి చెప్పారు. సినిమా చూసి తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకునే హక్కు ప్రేక్షకులకు ఎప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా టీజర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో కొందరు కావాలనే ఏఐ టెక్నాలజీ ఉపయోగించి నకిలీ, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు పోస్ట్ చేస్తున్నారని నిర్మాతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, నిర్మాత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ బెంగళూరు సివిల్ అండ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 19న న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంపై ముంబైలో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ... కొంతమంది డబ్బులు ఇచ్చి బాట్లతో, ఏఐ టెక్నాలజీతో దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పోరాటం అలాంటి వారిపైనే తప్ప, నిజమైన సినీ ప్రియులపై కాదని ఆయన వివరించారు. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు తమ విమర్శలను, అభిప్రాయాలను ఎలాంటి భయం లేకుండా చెప్పవచ్చని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా రేపు (సెప్టెంబర్ 24) 'ది ప్యారడైజ్' విడుదల కానుంది. ఇప్పటికే సెప్టెంబర్ 23 రాత్రి పలు నగరాల్లో ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రారంభమయ్యాయి. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.



మనం పార్టీ ఎప్పుడు ప్రారంభిస్తున్నాం? ఎయిర్‌పోర్ట్‌లో ధనుశ్‌కు ఊహించని ప్రశ్న, నవ్వుతూ దాటేసిన హీరో!

కోలీవుడ్ టాలెంటెడ్ హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సంచలన చిత్రం 'రాయన్' కు ఉత్తమ తమిళ చిత్రంగా జాతీయ అవార్డు దక్కిన విషయం తెలిసిందే. ఈ వేడుకల అనంతరం చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో పయణమవుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు ఆయనను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా అక్కడున్న ఒక మీడియా రిపోర్టర్ సరదాగా ధనుష్‌ను ఉద్దేశించి, (మనం రాజకీయ పార్టీ ఎప్పుడు ప్రారంభిస్తున్నాం?) అని ప్రశ్నించారు. సీఎం విజయ్ తర్వాత ధనుష్ కూడా పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్న వార్తల సందర్భంగా ఈ ప్రశ్నను రిపోర్టర్ అడిగారు. అయితే ఈ ఊహించని ప్రశ్నకు ధనుష్ ఎలాంటి సీరియస్ వ్యాఖ్యానాలు చేయకుండా, కేవలం చిరునవ్వు నవ్వుకుంటూ అక్కడి నుంచి సైలెంట్‌గా వెళ్లిపోయాడు ధనుష్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

అదరగొట్టేసిన రష్మిక మందన్నా.. టాక్ ఆఫ్ ది టౌన్‌గా మైసా టీజర్ వ్యూస్



కన్నడ భామ రష్మిక మందన్నా తొలిసారి యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్న ప్రాజెక్ట్ మైసా పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవువూ సినిమాపై అంచనాలు పెంచేస్తుందని తెలిసిందే. ఇక రెండు రోజుల క్రితం లాంచ్ చేసిన టీజర్ రష్మిక మందన్నాలోని మరో యాంగిల్‌ను చూడబోతున్నట్టు చెప్పేస్తుంది. డీగ్లామరైజ్‌డ్‌గా యాక్షన్ అవతార్‌లో గూస్‌బంప్స్ తెప్పించే యాక్టింగ్‌తో అదరగొట్టేస్తుంది. మైసా టీజర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. టీజర్ లాంచ్ చేసిన కొన్ని గంటల్లోనే 25 మిలియన్లకుపైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలుస్తోంది. రష్మిక మందన్నా ఊహించని లుక్‌లో అదరగొట్టేస్తూ.. విజయశాంతిని గుర్తుకు తెస్తోందంటూ కామెంట్లు పెడుతున్నారు మూవీ లవర్స్. ఈ మూవీలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని టీజర్‌తో తెలిసిపోతుంది. మైసా సినిమాతో ఇుఒఅఅఒఅఒఅఒ